ప్రతిపక్షం

www.prathipaksham.in

శుక్రవారం 27.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 338 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

చితక్కొట్టిన పాండ్యా, అభిషేక్.. భారత్ భారీ విజయం 10

వెలుగుమెట్లలో ఇళ్లు కూల్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమే

బాధితులకు స్థలం, ఇళ్లు ఇచ్చే బాధ్యత మాది

- ప్రభుత్వ ప్రగతి చూడలేకనే బీఆర్ఎస్‌విష ప్రచారం
- 'కాళేశ్వరం' బీఆర్ఎస్ అవినీతికి బిజెపీ సహకారం
- కేసీఆర్ అసెంబ్లీకి రావాలి.. మంచి సలహాలు, సూచనలు ఇవ్వాలి
- మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 26:- రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇప్పటివరకు జరిగిన పార్లమెంటు, ఉప ఎన్నికలు, పంచాయితీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టడాన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని, దీనికి బీజేపీ నేతలు వంత పాడుతున్నారని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట స్వామి ఆరోపించారు. గురువారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ బలరాం నాయిక్, రామ సహాయం రఘుమారెడ్డి, ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, మాధవరెడ్డితో కలసి

...:: మిగతా 2లో

"నేను మెకానికల్‌గా కాదు.. భావోద్వేగంతో, అనుబంధంతో మిమ్మల్ని కలిశాను" అని సీఎం అన్నారు. ప్రతి రోజు కార్యాలయానికి వెళ్లే ముందు పేదల పక్షపాతి ఎస్ఆర్ శంకరన్ను తలచుకోవాలని, పేదలకు సేవ చేసేముందు తల్లిదండ్రులను గుర్తు పెట్టుకోవాలని సూచించారు. తల్లిదండ్రులను గౌరవించని ఉద్యోగుల జీతంలో 10–15 శాతం కోత విధించేలా అసెంబ్లీలో చట్టం తీసుకురాబోతున్నామని ప్రకటించారు.

తెలంగాణ ప్రజలు ఆధిపత్యాన్ని ఒప్పుకోరు

బాధ్యత మరిచి మనిషిగా పతనం కావద్దు

- ఆఫీసుకువెళ్లే ముందు శంకరన్‌ను తలచుకోండి
- ప్రభుత్వానికి కళ్లు, చెవులు మీరే
- ప్రజలకు సంక్షేమ ఫలాలు అందేలా చూడండి
- రాంజీ గోండు, కొమరం భీం, సమ్మక్క-సారలమ్మలను స్ఫూర్తిని గుర్తుంచుకోవాలి
- గ్రూప్1, 2 నూతన అధికారులకు సీఎం రేవంత్ దిశా నిర్దేశనం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 26: 'తెలంగాణ ప్రజలు ఆకలినైనా సహిస్తారు, కానీ ఆధిపత్యాన్ని ఒప్పుకోరు' అని పేర్కొన్నారు. రాంజీ గోండు, కొమరం భీం రాజ్యాల కోసం కాదు, ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సమ్మక్క-సారలమ్మలు కాకతీయ సామ్రాజ్యంపై తిరుగుబాటు చేసి సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ కోసం అమరవీరులయ్యారని, వారి స్ఫూర్తిని అధికారులుగా ఎప్పటికీ గుర్తుంచుకోవాలని సూచించారు. గ్రూప్-1, 2 నూతన అధికారుల శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావోద్వేగంతో మాట్లాడారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులను అభినందిస్తూ,

...:: మిగతా 2లో

రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు

- 100 నియోజకవర్గాల్లో ప్రారంభించాలి
- ఆరుట్ల స్కూల్ తరహాలోనే ఈ స్కూళ్లు ఉండాలి
- పాఠశాల స్థాయి నుంచి ఏఐ బోధనకు చర్యలు
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్
- ప్రతి విద్యార్థికి 'విజయా డెయిరీ' పాలు
- ప్రయివేటు స్కూళ్ల ఫీజు నియంత్రణకు కమిటీ
- ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదు

...:: 2లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ – 6.27
(శుక్రవారం సాయంత్రం)

సహర్ – 5.14
(శనివారం ఉదయం)

ఎప్ స్టీన్‌ఫైల్స్ ఒత్తిడి వల్లే.. వాణిజ్య ఒప్పందం

భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని బెదిరించడానికి ఎప్‌స్టీన్ ఫైళ్లను అమెరికా అధ్యక్షుడు ఉపయోగించారని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు.

9

'ఇందిరమ్మ రాజ్యం'లో ఇళ్లను కూల్చడం అన్యాయం

- ఖమ్మం వెలుగుమట్ల ఘటనపై ఆగ్రహం
- బాధితులకు అండగా ఉంటాం
- ఇదే స్థలంలో మళ్లీ ఇళ్లు కట్టిస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం ప్రతినిధి, ఖమ్మం

ఫిబ్రవరి 26: పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాల్సిన 'ఇందిరమ్మ రాజ్యం'లో ఉన్న ఇళ్లను కూల్చడం అన్యాయం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. పట్టాలు, భూదాన్ బోర్డు పత్రాలు, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ కనీస నోటీసులు ఇవ్వకుండా కూల్చివేత జరపడం అమానుషమని విమర్శించారు. ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల ప్రాంతంలో వందలాది పేదల ఇళ్ల కూల్చివేత ఘటనలో ఇళ్లను కోల్పోయిన బాధితులను గురువారం కేటీఆర్ పరామర్శించి వారికి భరోసా ఇచ్చారు. ''మాకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా 4 వేల మంది

...:: మిగతా 2లో

ఇజ్రాయెల్‌లోనూ యూపీఐ సేవలు

పౌర అణు ఇంధనం, అంతరిక్ష విభాగాల్లోనూ కలిసి పనిచేస్తాం

- ఇరుదేశాల భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తాం
- సంయుక్తంగా కొత్త టెక్నాలజీల అభివృద్ధి
- ఇజ్రాయెల్ ప్రధానని నెతన్యాహూతో ద్వైపాక్షిక చర్చలు
- మీడియా సమావేశంలో భారత ప్రధాని మోడీ

ఇజ్రాయెల్

భారత్ ఇజ్రాయెల్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) త్వరలోనే తుది రూపును తీసుకుంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ వెల్లడించారు. ఈ డీల్ ఇరుదేశాలకూ ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఇజ్రాయెల్‌లో భారతదేశ యూపీఐను వినియోగంలోకి తేవడంపైనా ఒక ఒప్పందాన్ని కుదుర్చుకోబోతున్నామని చెప్పారు. పౌర అణు ఇంధనం, అంతరిక్ష విభాగాల్లోనూ భారత్, ఇజ్రాయెల్ కలిసి

...:: మిగతా 2లో

బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటాం

ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలోని అవినీతి' గురించి ఒక అధ్యాయం చేర్చడంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రూపొందించిన వారిని బాధ్యులుగా చేస్తామని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గురువారం పేర్కొన్నారు

9

రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

- 45 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ
- జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీగా రాహుల్ బొజ్జా
- విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిశోర్
- సీఎస్ఆర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సబ్యసాచి ఘోష్

...:: 5లో

అర్హులైన నిరుపేదలకు గృహ వసతి

- ఆహార భద్రతకూ మొదటి ప్రాధాన్యం
- ప్రారంభోత్సవానికి సిద్ధంగా హుజూర్నగర్ మోడల్ హౌసింగ్ కాలనీ
- రాష్ట్ర -మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 26: రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికీ గృహ వసతి కల్పించాలన్నదే ప్రభుత్వ దృఢ సంకల్పమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అదే సమయంలో ఆహారభద్రతకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని ఆయన చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తాను హౌసింగ్ మంత్రిగా ఉన్నప్పుడు హుజుర్నగర్ లో మొదలు పెట్టిన

...:: మిగతా 2లో

కుట్రదారులకు శిక్ష పడాలి

ఆ కాపీలను వెంటనే జప్తు చేయాలి

- ఎన్సీఈఆర్టీ వివాదంలో కేంద్రంపై సీజేఐ ఫైర్
- ఎన్సీఈఆర్టీ వివాదంపై సుప్రీంకోర్టు విచారణ
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం: సీజేఐ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ఎన్సీఈఆర్టీ వ్యవహారంపై, సుమోటోగా విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు చేసిన కుట్రేనని ఆగ్రహం వ్యక్తం చేసింది. జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎన్సీఈఆర్టీ) ముద్రించిన ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పాఠ్యపుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతిపై ఒక అధ్యాయాన్ని ప్రచురించడంపై సుప్రీంకోర్టు తీవ్రంగా మండిపడింది. దీనికి బాధ్యులెవరో తెలుసుకోవడం తమ విధి అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఎనిమిదో తరగతి పాఠ్యాంశ వ్యవహారంపై జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థ అధికారాన్ని అణచివేసేలా, గౌరవాన్ని కించపర్చేలా ఉద్దేశపూర్వకంగా చేసిన చర్యగా కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో లోతుగా పాతుకుపోయిన కుట్ర ఉందన్న సీజేఐ బాధ్యులకు శిక్ష పడాలని స్పష్టం చేశారు. అదేవిధంగా ఎన్సీఈఆర్టీ బుధవారం ఇచ్చిన వివరణలో ఎక్కడా క్షమాపణ అన్న పదమే లేదని, పైగా వారు తమ చర్యను సమర్థించుకుంటున్నారని సీజేఐ మండిపడ్డారు.

ఆ కాపీలను వెంటనే జప్తు చేయాలి

ఎన్సీఈఆర్టీ ముద్రించిన

...:: మిగతా 2లో

డిజిటల్ ప్లాట్ ఫామ్‌లు బాధ్యతల నుండి తప్పించుకోలేరు

డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ఇకపై బాధ్యత నుంచి తప్పించుకోలేవని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. తాము ప్రదర్శించే లేదా ప్రచురించే ప్రతి కంటెంట్‌కు పూర్తి బాధ్యత వహించాల్సిందేనని ఆయన కఠిన హెచ్చరిక చేశారు.

9

రాష్ట్రీయం

వెలుగుమెట్లలో ఇళ్లు కూల్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమే

మొదటిపేజీ తరువాయి

మాట్లాడారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 2023 జూలై 15న వెలుగుమట్లలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వమే పేదల ఇండ్లను కూలగొట్టించిందని చెబుతూ నాడు కూల్చివేత సంఘటనల ఫోటోలను ప్రదర్శించారు. అంతేగాక వెలుగుమెట్లలో పేదలకు ఇండ్లు తిరిగి కట్టిస్తామని హామీ ఇచ్చి గాలికి వదిలేసిందన్నారు. కానీ ఇందిరమ్మ ప్రభుత్వం హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా అక్కడ అక్రమంగా ఉన్న ఇండ్లను తొలగించడం జరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు అక్కడ అర్హులైన పేదలకు ఇంటి స్థలం, ఇళ్లు ఇస్తామని తెలిపారు. పేదలే ఇందిరమ్మ ప్రభుత్వం పెటెంట్ అని, ఈ విషయంలో నిజంగా పేదలపై బీఆర్ఎస్ బావ మరుదులు, ఫాంహౌస్ లో ఉండి కుట్రలు చేస్తున్న కేసీఆర్ వెంటనే స్పందించి కాళేశ్వరంలో దోచుకున్న, దాచుకున్న సొమ్ములో కొంత భాగాన్ని బయటకు తీసి పేదలకు ఇళ్లు కట్టించి పాప పరిహారం చేసుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కాదని కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టి ఎనిమిదవ వింతగా ప్రచారం చేసుకుందన్నారు. వారి హయాంలోనే లక్షలాది కోట్ల ప్రాజెక్టు అవినీతి కారణంగా బీటలువారడం కూడా జరిగిందని, నాలుగేళ్లలో 168 టీఎంసీల నీరు ఇస్తామని చెప్పి, 50 టీఎంసీల నీటిని సముద్రం పాలుచేశారని అన్నారు.

బీఆర్ఎస్ తో చేతులు కలిపిన బీజేపీ

కాళేశ్వరం ప్రాజెక్ట్ బీఆర్ఎస్ కు ఏటీఎంగా మారిందన్న బీజేపీ నేతలు బీఆర్ఎస్ తో చేతులు కలిపారని, జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఇచ్చినా, అసెంబ్లీలో తీర్మానం చేసి సీబీఐకి ఇచ్చినా ఇంతవరకు కేంద్రం కనీసం స్పందించలేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో వదిలేసిన ప్రాజెక్టులను మేం పూర్తి చేస్తున్నాం. 16 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీకి కేసీఆర్, బావ బావమరుదులు వచ్చి మాట్లాడాలని అన్నారు. వారు గతంలో ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వలేదని, మేం కచ్చితంగా అవకాశం ఇస్తామని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం నీటి ప్రాజెక్టుల విషయంలో ఉత్తర తెలంగాణకు పూర్తిగా అన్యాయం చేసిందని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని అన్నారు. మా ప్రభుత్వం వచ్చాక శ్వేత పత్రం ఇచ్చామని, కాళేశ్వరంపై చర్చించామని, కేంద్రం చర్యలు కోరామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 48వేల కోట్లు మిత్తిగా కట్టిందని, కేంద్ర ప్రభుత్వం ఇకనైనా నిధులు ఇవ్వాలని కోరారు. మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అవినీతికి పాల్పడినందునే దేశంలోని ప్రాంతీయ పార్టీల్లోకెల్లా ధనిక పార్టీగా మారిందన్నారు. సుమారు వెయ్యి కోట్ల రూపాయిల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఎలక్ట్రోరల్ బాండ్లు దీనికి నిదర్శనమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కారణంగా ఏర్పడిన నష్టాన్ని కేసీఆర్ నుంచి వసూలు చేయాల్సిన అవసరం ఉందని,. కాంట్రాక్టర్లు, కాసుల కోసమే బీఆర్ఎస్ అనుకూల నీటిప్రాజెక్టలను చేపట్టిందని తెలిపారు.

తెలంగాణ ప్రజలు ఆధిపత్యాన్ని ఒప్పుకోరు

మొదటిపేజీ తరువాయి

'మొన్న మీరు విద్యార్థులు.. నిన్న నిరుద్యోగులు..ఈ రోజు అధికారులు. ఇకపై నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యత మీదే' అని స్పష్టం చేశారు. మొదటి లోక్‌సభ ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక మెజార్టీతో గెలిచిన తెలంగాణ బిడ్డ రావి నారాయణ రెడ్డిని ఉదాహరణగా పేర్కొన్నారు. ఆరు లక్షల మంది పోటీపడగా 582 మంది గ్రూప్-1, గ్రూప్ 2లో 775 మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. 15 ఏళ్లుగా గ్రూప్-1 నియామకాలు జరగలేదని, ప్రజా ప్రభుత్వం నిర్వహించి అభ్యర్థుల ఆకాంక్షలను నెరవేర్చిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ను ప్రక్షాళన చేసి, గ్రూప్ పరీక్షలపై అవగాహన ఉన్నవారిని చైర్మన్, సభ్యులుగా నియమించామని వివరించారు. ప్రశ్నాపత్రాలు లీక్ కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. గ్రూప్-1 ఫలితాలపై కోర్టు కేసులు వచ్చినా, అభ్యర్థులు మెరిట్ ఆధారంగా ఎంపికయ్యారని నమ్మి ప్రభుత్వం సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడిందన్నారు. "అధికారులయ్యాక బాధ్యత మరిచి మనిషిగా పతనం కావద్దు. ప్రభుత్వానికి కళ్లు, చెవులు మీరు. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా పనిచేయాలి" అని హితవు పలికారు.

ఎస్ఆర్ శంకరన్ను తలచుకోండి

"నేను మెకానికల్‌గా కాదు.. భావోద్వేగంతో, అనుబంధంతో మిమ్మల్ని కలిశాను" అని సీఎం అన్నారు. ప్రతి రోజు కార్యాలయానికి వెళ్లే ముందు పేదల పక్షపాతి ఎస్ఆర్ శంకరన్ను తలచుకోవాలని, పేదలకు సేవ చేసేముందు తల్లిదండ్రులను గుర్తు పెట్టుకోవాలని సూచించారు. తల్లిదండ్రులను గౌరవించని ఉద్యోగుల జీతంలో 10-15 శాతం కోత విధించేలా అసెంబ్లీలో చట్టం తీసుకురాబోతున్నామని ప్రకటించారు. అంతర్జాతీయ స్థాయి శిక్షణ కోసం త్వరలోనే హార్వర్డ్ యూనివర్సిటీ- ఎంసీహెచ్ఆర్డీ మధ్య ఒప్పందం కుదుర్చి, హార్వర్డ్ నిపుణులు ఎంసీహెచ్ఆర్డీలో శిక్షణ అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధికారులు ప్రజా సేవలో అంకితభావంతో పనిచేయాలని సీఎం ఆకాంక్షించారు.

రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు

- 100 నియోజకవర్గాల్లో ప్రారంభించాలి
- ఆరుట్ల స్కూల్ తరహాలోనే ఉండాలి
- పాఠశాల స్థాయి నుంచి ఏఐ బోధన
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్
- ప్రతి విద్యార్థికి 'విజయా డెయిరీ' పాలు
- ప్రయివేటు స్కూళ్ల ఫీజు నియంత్రణకు కమిటీ
- ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 26: రాష్ట్ర వ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఈ ఏడాది నుంచి ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. తరగతి గదులు, క్రీడా మైదానం, ఇతర అన్ని రకాల వసతులు, బోధనా సిబ్బంది, రవాణా సౌకర్యం కలిగి ఉన్న రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరహాలోనే ఈ వంద స్కూళ్లు ఉండాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యా శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. నాణ్యమైన విద్యకు చిరునామాగా తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఇందుకు ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదని చెప్పారు. ఈ సందర్భంగా అధికారులు, ఇంజనీర్లకు ముఖ్యమంత్రి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలల తరహాలో నిర్మించాలని, వీటి నిర్మాణంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని, ఏడాదిలో క్యూర్ పరిధిలో నిర్దేశించుకున్న 12 ఇంటిగ్రేటెడ్ నూతన పాఠశాలల నిర్మాణం పూర్తికావాలని అన్నారు. హైదరాబాద్ లోని భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూళ్లలో ఉండే అన్ని వసతులు ఈ ఇంటిగ్రేటెడ్ పాఠశాలల్లో ఉండాలని సూచించారు. క్యూర్‌లో అప్‌గ్రేడ్ చేయనున్న 17 పాఠశాలలు, అదనపు గదులు, ఇతర వసతులు కల్పించనున్న 164 పాఠశాలల పనుల్లో ఎటువంటి రాజీ పడకూడదని ఆదేశించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో 99 రోజుల పాటు చేపట్టనున్న కార్యక్రమాల్లో వారం రోజులు విద్యా సంబంధిత అంశాలకు కేటాయించాలని. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాఠశాలలు, కళాశాలలను సందర్శించి అవసరమైన వసతుల కల్పన, ఇతర అంశాలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌అన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) ప్రపంచాన్ని శాసిస్తున్న నేపథ్యంలో పాఠశాల స్థాయి నుంచి దాని బోధనకు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని, మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకునేలా ఏఐపై ఉపాధ్యాయులు, లెక్చరర్లకు స్వల్పకాలిక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్

సాంకేతిక విద్యా విధానంలో అందుకు అనుగుణమైన మార్పులను తీసుకురావాలని, 2026-27 విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ అమలు చేయాలని సీఎం విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు. బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు ప్రతి విద్యార్థికి పాలు అందజేయాలని, పాలను విజయా డెయిరీ నుంచి సేకరించాలని అన్నారు. పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, పుస్తకాలతో పాటు ఈ ఏడాది నుంచి కిట్ అందజేయాలని, ఆ కిట్లో స్కూల్ బ్యాగ్, పెన్నులు, పెన్సిళ్లు, షార్పనర్లు, రంగుల పెన్సిళ్లు, జామెట్రీ బాక్సులు, డిక్షనరీ, బూట్లు, సాక్సులు ఉండాలని ఇందుకు సంబంధించిన మొత్తాన్ని బడ్జెట్‌లో పొందుపర్చాలని అన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలు, ఏటీసీల్లో ఏఐ ఆధారిత కోర్సులు వెంటనే ప్రారంభించాలని, కాలం చెల్లిన కోర్సులను తొలగించాలన్నారు. పాలిటెక్నిక్, ఏటీసీల్లో కోర్సులు పూర్తి చేసిన వారికి వెంటనే వివిధ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు లభించేలా చూడాలని సీఎం అన్నారు. రాష్ట్రంలోని అన్ని విశ్వ విద్యాలయాలకు నిధులు కేటాయిస్తామని, ఇప్పటికే ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్లు కేటాయించిన నేపథ్యంలో, మిగతా వర్సిటీలకు ఎంత నిధులు అవసరమనే దానిపై నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు.

ప్రయివేటు స్కూళ్ల ఫీజుల నిర్ణయంపై నివేదిక ఇవ్వండి

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు సంబంధించి తెలంగాణ ప్రవేటు పాఠశాలల ఫీజు రెగ్యులటరీ మానిటరింగ్ కమిషన్ తమ నివేదికలోని అంశాలను ముఖ్యమంత్రి ముందుంచారు. వివిధ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న విధానాలు, తెలంగాణలో తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. వివరాలు తెలుసుకున్న అనంతరం జిల్లా స్థాయిలో కలెక్టర్, డీఈవోల నేతృత్వంలో పాఠశాలలను పరిశీలించి ఫీజుల నిర్ణయంపై నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో రిటైర్డ్ జడ్జి లేదా రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ స్థాయిలోని కమిటీ తుది కమిటీగా ఉండి నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. ఈ సమావేశంలో విద్యా కమిషన్ సభ్యులు, విద్యా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ రాజ్యం'లో ఇళ్లను కూల్చడం అన్యాయం

మొదటిపేజీ తరువాయి

పోలీసులతో వచ్చారు. పేద ప్రజలు ఏం చేస్తారు వచ్చి కష్టపడి రూపాయి రూపాయి కూడబెట్టి కట్టుకున్న ఇండ్లను కూల్చేస్తున్నారు సార్ అంటూ కేటీఆర్‌తో ఓ యువతి అక్కడి వారి ఆవేదనను పంచుకుంది. మా ప్రతీ భూమికి పట్టాలున్నాయి. నా ఆరో తరగతి నుంచి నేనిక్కడే ఉంటున్నా.. ఇక్కడే 10వ తరగతి కూడా పూర్తయింది. మా నాన్న కూలీకెళ్తరు. మేమిక్కడే ఉంటున్నాం.. కోర్టు ఆర్డర్లను కూడా ధిక్కరించి ఈ ప్రభుత్వం ఇలా చేస్తుంది. మీకు కూలగొట్టిన ప్రతీ ఇల్లు చూపిస్తాం. మా కష్టార్జితం.. మా కన్నీళ్లు.. మా ఆశలు.." అంటూ ఆవేదన వ్యక్తం చేసింది.

ప్రభుత్వమే ఇచ్చిన పట్టాలు ఉన్నా కూల్చివేతలా?

బాధితులు తమ వద్ద ఉన్న భూమి పట్టాలు, ఆస్తి పన్ను రశీదులు, ఇంటి పన్ను పత్రాలు, విద్యుత్ కనెక్షన్ రికార్డులను కేటీఆర్‌కు చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. "ఇవి ప్రభుత్వమే ఇచ్చిన పత్రాలు కదా, మరి మా ఇళ్లను ఎలా కూలుస్తారు?" అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. గత ప్రభుత్వ హయాంలో జీవోల ప్రకారం దరఖాస్తు చేసుకుని ఎలాంటి ఇబ్బంది లేకుండా నివసిస్తున్నామని, ప్రస్తుత ప్రభుత్వం అర్ధరాత్రి నోటీసులు లేకుండా కూల్చివేతకు పాల్పడిందని ఆరోపించారు. బాధితుల వద్ద ఉన్న పత్రాలను పరిశీలించిన కేటీఆర్ ప్రభుత్వం వైఖరిపై మండిపడ్డారు. పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాల్సిన 'ఇందిరమ్మ రాజ్యం'లో ఉన్న ఇళ్లను కూల్చడం అన్యాయం అని వ్యాఖ్యానించారు. పట్టాలు, భూదాన్ బోర్డు పత్రాలు, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ కనీస నోటీసులు ఇవ్వకుండా కూల్చివేత జరపడం అమానుషమని విమర్శించారు. ఖమ్మంలో 150 ఇళ్లతో పాటు మహబూబ్ నగర్ జిల్లాలో దివ్యాంగుల ఇళ్ల కూల్చివేత ఘటనలను కూడా ఆయన ప్రస్తావించారు.

ఇదే స్థలంలో మళ్లీ ఇళ్లు కట్టిస్తాం

బాధిత కుటుంబాలకు ధైర్యం చెబుతూ, "ఎవరూ అధైర్య పడొద్దు. మీ అందరికీ ఇదే స్థలంలో మళ్లీ ఇళ్లు కట్టించి గృహప్రవేశాలు చేయించే బాధ్యత నాది" అని హామీ ఇచ్చారు. కలెక్టర్, చీఫ్ సెక్రటరీలను కలిసి బాధితుల తరఫున న్యాయం కోరుతామని తెలిపారు. అవసరమైతే శాసనసభ నుంచి సుప్రీంకోర్టు వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం బాధితులను విడదీయాలని ప్రయత్నిస్తోందని, అయితే అందరూ ఐక్యంగా ఉంటేనే విజయం సాధ్యమని కేటీఆర్ సూచించారు. చట్టపరమైన ఆధారాలు తమవైపే ఉన్నాయని, భయపడాల్సిన అవసరం లేదని బాధితులకు భరోసా ఇచ్చారు.

అర్హులైన నిరుపేదలకు గృహ వసతి

మొదటిపేజీ తరువాయి

మోడల్ హౌసింగ్ కాలనీ మళ్లీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే పూర్తి అయ్యి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. మార్చి రెండోవారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మోడల్ హౌసింగ్ కాలనీని ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. హుజుర్నగర్ నియోజకవర్గ కేంద్రంలోనీ సుప్రసిద్ధ రామస్వామి గుట్ట సమీపంలో 110 ఎకరాలలో 125 కోట్లతో నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని గురువారం సాయంత్రం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సందర్శించారు .ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తాను గృహ నిర్మాణా శాఖామంత్రిగా ఉన్నప్పుడు మోడల్ కాలనీని 2011లో ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావం నాటికి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, ఆ తరువాత వచ్చిన బీఆర్ఎస్ పాలకులు డబుల్ బెడ్ రూమ్ పేరుతో అధికారంలోకి వచ్చి ఈ మోడల్ హౌసింగ్ కాలనీని నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. దశాబ్దకాలం తరువాత తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తాను మంత్రి పదవి చెపట్టాక మోడల్ హౌసింగ్ కాలనీని పూర్తి చేయాలన్న లక్ష్యంతో నిధులు మంజూరు చేయించి పనులు త్వరితగతిన పూర్తి చేసి ఈ కాలనీ ప్రారంభోత్సవానికి సిద్ధం చేశామన్నారు. ఈ మోడల్ హౌసింగ్ కాలనీలో కేటాయింపులు పూర్తిగా పారదర్శకంగా ఉంటాయన్నారు. మొదటి దశలో 1000 మంది లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే 95% పనులు మేర పూర్తి అయ్యాయని వాటిని కుడా త్వరితగతిన పూర్తి చేయించి లబ్ధిదారులకు కేటాయింపులు ఉంటాయని ఆయన వివరించారు. మోడల్ హౌసింగ్ కాలనీ ప్రారంభోత్సవం రోజున లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో కలసి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆహార భద్రతకు పెద్ద పీట వేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

ఇజ్రాయెల్‌లోనూ యూపీఐ సేవలు

మొదటిపేజీ తరువాయి

పనిచేస్తాయన్నారు. గురువారం మధ్యాహ్నం జెరూసలెంలో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూతో భారత ప్రధాని మోడీ ద్వైపాక్షిక చర్చలు నిర్వహించారు. అనంతరం ఇద్దరూ కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో పై వివరాలను మోదీ ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు, బయో టెక్నాలజీ, క్లీన్ ఎనర్జీ వంటి టెక్నాలజీలలో ఇరుదేశాల భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తామన్నారు. భవిష్యత్ వ్యవసాయ అవసరాలను తీర్చగల కొత్త టెక్నాలజీలనూ సంయుక్తంగా అభివృద్ధి చేస్తామని ప్రధాని చెప్పారు. భారత్, ఇజ్రాయెల్‌లలో విలేజెస్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను క్రియేట్ చేయడంపైనా ఫోకస్ పెడతామన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా రక్షణ రంగంలోనూ ఇరుదేశాలు సహకరించుకుంటున్నాయని ఆయన గుర్తుచేశారు. రక్షణ రంగంలో గత సంవత్సరం ఇరుదేశాల మధ్య కుదిరిన అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) సరికొత్త దిశను చూపిస్తుందనే ఆశాభావాన్ని మోదీ వ్యక్తం చేశారు. భారత్, ఇజ్రాయెల్ మధ్య సంబంధాలు ప్రతి సవాల్‌ను తట్టుకుని కాలపరీక్షకు నిలిచాయని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. పరస్పర విశ్వాసం, ప్రజాస్వామ్య విలువలపై ఏర్పడిన ఈ బంధం ఎంతో బలమైనదని పేర్కొన్నారు. ఇరు దేశాల భాగస్వామ్యాన్ని 'శాంతి, ఆవిష్కరణ, శ్రేయస్సు కోసం ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచుతూ చారిత్రక నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. కృత్రిమ మేధ, క్వాంటం, క్రిటికల్ మినరల్స్ వంటి రంగాల్లో సహకారాన్ని వేగవంతం చేసేందుకు 'క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ పార్ట్‌నర్‌షిప్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయెల్‌లో యూపీఐ సేవలను వినియోగించేందుకు ఒప్పందం కుదరడం సంతోషంగా ఉందన్నారు. వ్యవసాయ రంగంలో సహకారానికి సుదీర్ఘ చరిత్ర ఉందని, దీన్ని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని నిర్ణయించామని ప్రధాని చెప్పారు. ఇజ్రాయెల్ సహకారంతో భారత్‌లో ఏర్పాటు చేసిన సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ విజయవంతం కావడంతో వాటి సంఖ్యను 100కు పెంచనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి తుదిరూపు ఇస్తామని పేర్కొన్నారు. ఉగ్రవాదంపై ఇరుదేశాల వైఖరి స్పష్టంగా ఉందని, దానికి ప్రపంచంలో చోటులేదని మోదీ స్పష్టంచేశారు. గాజా శాంతి ప్రణాళిక ద్వారా శాంతికి మార్గం ఏర్పడిందని, ఈ ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతు ఇచ్చిందని పునరుద్ఘాటించారు. తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ ఇజ్రాయెల్ చారిత్రక గడ్డపై అడుగుపెట్టడం గర్వంగా, భావోద్వేగంగా ఉందని మోడీ అన్నారు. ఇజ్రాయెల్ పార్లమెంట్ 'క్నెస్సెట్'లో ప్రసంగించే అవకాశం కల్పించినందుకు, స్పీకర్ మెడల్‌తో సత్కరించినందుకు ఆ దేశ ప్రధాని నెతన్యాహుకు, ఇజ్రాయెల్ ప్రజలకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన చిన్నదే అయినప్పటికీ, అది అసాధారణంగా ఫలవంతమైందని, హృదయాలను కదిలించిందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. ఈ సందర్భంగా భారత్‌లో ప్రభుత్వ స్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన ప్రకటించారు. ఇది ఇరుదేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

కుట్రదారులకు శిక్ష పడాలి

మొదటిపేజీ తరువాయి

పుస్తకంలోని వివాదాస్పద అధ్యాయం ఉన్న భౌతిక, డిజిటల్ కాపీలను వెంటనే జప్తు చేయాలని సీజేఐ ఆదేశించారు. సదరు అధ్యాయం ఉన్న పుస్తకాన్ని ప్రింట్ చేయడం లేదా డిజిటల్ రూపంలో పంపిణీ చేయడంపై పూర్తిస్థాయి నిషేధం విధించాలని పేర్కొన్నారు. ఈ తప్పుకు బాధ్యులను చేస్తూ ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరించాలని ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్, పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి, విద్యా మంత్రిత్వ శాఖకు సుప్రీంకోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మరోవైపు, కేంద్ర విద్యాశాఖ తరఫున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పాఠ్యాంశం వ్యవహారంలో సుప్రీం కోర్టుకు భేషరతుగా క్షమాపణలు చెప్పారు. ఈ వ్యవహారాన్ని కేంద్ర ప్రభుత్వం సమర్థించుకోవడం లేదని కోర్టుకు వెల్లడించారు. బాధ్యతాయుతమైన వ్యక్తులు అలాంటి పనిలో ఇకపై ఉండరని కోర్టుకు తెలిపారు. అది చాలా చిన్న పరిణామమని చెప్పిన సీజేఐ ప్రచురించిన పుస్తకం ఇప్పటికే మార్కెట్ లో ఉందని, ఒక కాపీ తనకు కూడా వచ్చిందని తెలిపారు. ఈ అంశాన్ని పట్టించుకోకుండా వదిలేస్తే న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోతుందని పేర్కొన్నారు. ఈ అంశంలో మీడియా బాధ్యతాయుతమైన పాత్ర పోషించిందని సీజేఐ ధర్మాసనం అభినందించింది. ప్రజాస్వామ్య నాలుగో స్తంభంగా మీడియా నిలిచిందని కొనియాడింది. పాఠ్యాంశంపై మరింత లోతైన దర్యాప్తు జరగాలని భావిస్తున్నట్లు చెప్పిన ధర్మాసనం తదుపరి విచారణను మార్చి 11కు వాయిదా వేసింది.

న్యాయవ్యవస్థలో అవినీతి గురించి మనం ఏం బోధిస్తున్నాం? : మోడీ

ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పుస్తకంపై విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ, ఆ సంస్థపై తీరుపై ప్రధానమంత్రి కార్యాలయం తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం, "మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రధాని మోదీ ఈ విషయంపై తన అసహనాన్ని వ్యక్తం చేశారు. 8వ తరగతి విద్యార్థులకు న్యాయవ్యవస్థలో అవినీతి గురించి మనం ఏం బోధిస్తున్నాం? వీటన్నింటినీ ఎవరు పర్యవేక్షిస్తున్నారు? దీనికి సంబంధించి ఎవరినైనా బాధ్యులను చేశారా?" అని మోదీ ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

ఎవరు బాధ్యులో మేం కనుగొంటాం: మనన్ కుమార్ మిశ్రా

ఇదిలా ఉండగా, ఈ విషయంపై బీజేపీ ఎంపీ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా మీడియాతో మాట్లాడారు. "సుప్రీం కోర్టు ఈ సంఘటనను చాలా సీరియస్‌గా తీసుకుంది. సమగ్ర విచారణకు ఆదేశించింది. ఈ కేసులో సొలిసిటర్ జనరల్ స్వయంగా కోర్టుకు హాజరయ్యారు. ఆయన దాని గురించి చాలా సానుకూలంగా ఉన్నారు. దీనికి ఎవరు బాధ్యులో తాము కనుగొంటామని, ప్రమేయం ఉన్న వారిని పట్టుకుని తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏ పుస్తకాలు విడుదలైనా, వాటిని ఉపసంహరించుకోవాలి. దీనిపై బార్ చాలా ఆందోళన చెందుతోంది.

ఇలాంటి చర్యను బార్ అంగీకరించదు. దాదాపు అందరు బార్ నాయకులు కోర్టులో ఉన్నారు. అలాంటి ఉత్తర్వును జారీ చేయడంలో సుప్రీంకోర్టుకు సహాయం చేస్తున్నారు. ఎన్‌సీఈఆర్‌టీ చర్య చాలా అభ్యంతరకరమైనదని, ఆ అంశంపై తీవ్రమైన చర్యలు తీసుకోవాలని బార్ అభిప్రాయపడింది." మనన్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు.

"

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ తమ ఆదాయంలో కంటెంట్ క్రియేటర్లకు న్యాయమైన వాటా ఇవ్వాలి. ప్రొఫెషనల్ జర్నలిస్టుల నుంచి మారుమూల ప్రాంతాల క్రియేటర్ల వరకు అందరికీ దీన్ని వర్తింపజేయాలి. డీప్ ఫేక్ వీడియోలు పెరిగిపోతున్నాయి. పబ్లిష్ అయ్యే ప్రతీ కంటెంట్‌కూ ఆయా ప్లాట్‌ఫామ్స్ బాధ్యత వహించాలి.

- డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ కాంక్లేవ్‌లో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్

అగ్రశ్రేణి లాజిస్టిక్ హబ్‌గా తెలంగాణ

- 2047 నాటికి ఈ రంగంలో తిరుగులేని శక్తిగా రాష్ట్రం
- 'ఫ్యూచర్ రెడీ ఎకో సిస్టం' అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు
- 'ట్రాన్స్ పోర్ట్ లాజిస్టిక్ ఇండియా 2026' సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 26: తెలంగాణను దేశంలోని అగ్రశ్రేణి లాజిస్టిక్ హబ్ లల్లో ఒకటిగా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఆ దిశగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ ఇంటిగ్రేషన్, పాలసీ అండ్ రెగ్యూలేటరీ ఫెసిలిటేషన్, సస్టైనబిలిటీ అండ్ గ్రీన్ లాజిస్టిక్స్, స్కిల్ డెవలెప్ మెంట్ అండ్ ఇన్నోవేషన్ తో కూడిన 'ఫ్యూచర్ రెడీ ఎకో సిస్టం' అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ముంబై లోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్ లో 'మెస్సే ముంచెన్ ఇండియా(మెస్సే ముంచెన్ జర్మనీ అనుబంధ సంస్థ)' నిర్వహిస్తోన్న 'ట్రాన్స్ పోర్ట్ లాజిస్టిక్ ఇండియా 2026' సదస్సులో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... దేశ ఆర్థిక గమనాన్ని నిర్దేశించే కీలక రంగాల్లో ప్రధానమైన 'లాజిస్టిక్ రంగం'లో 2047 నాటికి తెలంగాణను తిరుగులేని శక్తిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. భౌగోళిక విస్తీర్ణంలో పదకొండు, జనాభాలో పన్నెండో స్థానంలో ఉన్న తెలంగాణ వాటా దేశ జీడీపీలో ప్రస్తుతం 5 శాతంగా ఉందన్నారు. దీనిని 2047 నాటికి 10 శాతానికి పెంచాలనే సంకల్పంతోనే 'తెలంగాణ రైజింగ్ 2047' డాక్యుమెంట్ కు శ్రీకారం చుట్టామన్నారు. 3 ట్రిలియన్ డాలర్లకు తెలంగాణ ఆర్థిక వ్యవస్థను చేర్చాలనే లక్ష్య సాధనలో లాజిస్టిక్ రంగానిదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసుల పునర్నిర్మాణం, ఏఐ ఆధారిత ఇంటెలిజెంట్ లాజిస్టిక్స్, సస్టైనబిలిటీ అనే మూడు ప్రధాన మార్పులు లాజిస్టిక్స్ రంగాన్ని సమూలంగా మార్చేస్తున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో భౌగోళికంగా మనకున్న అనుకూలతలను 'డిజైన్ అడ్వాంటేజ్'గా మార్చుకుని సత్తా చాటేలా ముందుకెళ్తున్నామన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో ఫేజ్ - 2, కొత్త ఎయిర్ పోర్టులు, డ్రై పోర్టు, తెలంగాణ లాజిస్టిక్స్ పాలసీ 2.0, లాజిస్టిక్ హబ్స్ తదితర ప్రాజెక్టులు ఈ రంగంలో రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా మార్చుతాయనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఇతర భాగస్వామ్య పక్షాల సహకారంతో లాజిస్టిక్స్ రంగానికి అవసరమైన రెడీ టూ వర్క్ ఫోర్స్ ను తయారు చేస్తున్నామని పునరుద్ఘాటించారు. కేవలం వస్తువులను ఉత్పత్తి చేయడమే కాకుండా, వాటిని ప్రపంచం ఊహించని వేగంతో డెలివరీ చేసి 'లాజిస్టిక్ పవర్ హౌస్'గా ఎదిగే సత్తా తెలంగాణకు ఉందని స్పష్టం చేశారు. మల్టీ మోడల్, రైల్ లింక్డ్ అసెట్స్, ఎయిర్ కార్గో, కోల్డ్ చైన్, గ్రేడ్ - ఏ వేర్ హౌజింగ్, ఆటోమేషన్, డిజిటల్ ప్లాట్ ఫామ్స్, గ్రీన్ మొబిలిటీ తదితర కేటగిరీల్లో పెట్టుబడులు పెట్టి 'తెలంగాణ రైజింగ్'లో భాగస్వామ్యం కావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. వేగవంతమైన అనుమతులు, పారదర్శకమైన పాలసీలు, ప్రోత్సాహకర విధానాలతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



రాష్ట్ర గవర్నర్ జిష్ను దేవ్ వర్మను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క గురువారం లోక్ భవన్లో మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే నెల 5న హైదరాబాద్ లో జరగనున్న తన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని వివాహ ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు.
- ప్రతిపక్షం, హైదరాబాద్

గండిపల్లి రిజర్వాయర్‌కు 100 కోట్లు కేటాయించాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చాడ వెంకటరెడ్డి లేఖ



ప్రతిపక్షం, హుస్నాబాద్, ఫిబ్రవరి 26: హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని గండిపల్లి రిజర్వాయర్ పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక లేఖ రాశారు. గౌరవెల్లి ప్రాజెక్టుతో పాటు గండిపల్లి రిజర్వాయర్‌ను కూడా పూర్తి చేసేందుకు తగిన నిధులు కేటాయించి, తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.హుస్నాబాద్ మెట్ట ప్రాంత రైతులకు సాగునీరు అందించే లక్ష్యంతో 2007లో అప్పటి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం జలయజ్ఞంలో భాగంగా గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్లకు శంకుస్థాపన చేసిందని చాడ గుర్తు చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం, నిధుల కొరత వల్ల ఈ ప్రాజెక్టులు దశాబ్ద కాలంగా అసంపూర్తిగానే మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గండిపల్లి ప్రాజెక్టు పూర్తయితే అక్కన్నపేట మండలంలోని దాదాపు 14 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు.గండిపల్లి ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ పూర్తయినప్పటికీ, నిధులు విడుదల కాకపోవడంతో కేవలం 40 శాతం పనులు మాత్రమే జరిగాయని లేఖలో పేర్కొన్నారు.మొత్తం 660 ఎకరాలకు గాను ఇప్పటికే 300 ఎకరాల భూమిని సేకరించారు. మిగిలిన భూసేకరణ పూర్తి చేసి పనులు వేగవంతం చేయాలి. గండిపల్లి పూర్తయితేనే శ్రీరాంసాగర్ వరద కాలువ లక్ష్యం నెరవేరుతుందని స్పష్టం చేశారు.గౌరవెల్లి ప్రాజెక్టుపై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించడాన్ని స్వాగతించిన ఆయన, అదే సమయంలో గండిపల్లి ప్రస్తావన లేకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా రూ.100 కోట్లు మంజూరు చేయాలని చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఈ లేఖ ప్రతులను సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ కు కూడా పంపినట్లు ఆయన తెలిపారు.

గంజాయి పెడ్లర్ల అరెస్ట్

- 2.6 కిలోల గంజాయి స్వాధీనం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 26 : కొల్లూరు పరిధిలో గంజాయి విక్రయిస్తుండగా ఇద్దరు వ్యక్తులను ఎస్ఓటి పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కొల్లూరు అంబేద్కర్ కాలనీలో 2.6 కిలోల గంజాయి శేరిలింగంపల్లి జోన్ ఎస్ఓటి పోలీసులు పట్టుకున్నారు. అద్దె కారులో మహారాష్ట్ర నుంచి తీసుకువచ్చి సప్లయ్ చేస్తుండగా మహ్మద్ ఖాన్, ఒవెజ్ అనే వ్యక్తులను ఎస్ఓటి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2.6 కిలోల గంజాయితో పాటు బెలెనో కారు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

జేఎన్‌జే సొసైటీ స్థలాల

'వే అవుట్'కు కసరత్తు

- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 26 : రాష్ట్రంలో 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ఇళ్ల స్థలాల అంశంపై న్యాయపరమైన చిక్కులు, అవాంతరాలు లేకుండా ఒక "వే అవుట్" కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం సచివాలయంలోని ఆయన చాంబర్‌లో మాట్లాడారు. జేఎన్‌జే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు న్యాయపరంగా మార్గం చూపిస్తామని, ఇందుకు ప్రభుత్వం, ముఖ్యమంత్రి కూడా ఇప్పటికీ జవహర్ లాల్ సొసైటీ జర్నలిస్టుల పట్ల సానుకూలంగా ఉన్నారని వెల్లడించారు. జర్నలిస్టుల బాధలు తనకు తెలుసునని మంత్రి అన్నారు. గత ప్రభుత్వంలో ఎంత ఇబ్బంది పడ్డారో కూడా అర్థమైందన్నారు. పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం పేటెంట్ గా ఉందని ఖమ్మం జిల్లా వెలుగుమెట్లలో పేదల ఇండ్లు కూల్చిన అంశంపై మంత్రి పొంగులేటి నిజమైన, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ప్రభుత్వంలో ఇళ్లు కట్టి ఇస్తుందని పేర్కొన్న తీరుపై మంత్రి జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలపై ప్రభుత్వ సానుకూలతను స్పష్టం చేశారు.

సంక్షేమం, అభివృద్ధిపై

వందరోజుల కార్యక్రమం

- అన్ని శాఖలు విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 26: రాష్ట్రంలో వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై 100 రోజుల కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణా రావు వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తోపాటు రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనే ఈ వంద రోజుల కార్యక్రమంలో అన్ని శాఖల వారీగా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో సీఎస్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎస్ మాట్లాడుతూ, ఈ వంద రోజుల కార్యక్రమంపై ఈ నెల 28న నిర్వహించే కార్యదర్శుల సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరవుతారని తెలిపారు. అదే విధంగా మార్చ్ 1న ఆదివారం జిల్లా కలెక్టర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మార్చి 2 నుండి జూన్ 9 వరకు వివిధ అభివృద్ధి పనులపై ప్రతీ శాఖ తమ 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ముఖ్యమంత్రి తో పాటు రాష్ట్రమంత్రులు ప్రారంభిస్తారని, ఇందుకు గాను ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ భవనాలను సిద్ధం చేయాలని అన్నారు. ముఖ్యంగా, పారిశుధ్యం గ్రామీణాభివృద్ధి ఆరోగ్య తదితర కార్యక్రమాలపై నూతనంగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లకు అవగాహన చైతన్య కార్యక్రమాల మాదిరిగా కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. సచివాలయం తోపాటు హెచ్ఓడీలలో ఈ ఆఫీస్ ను అమలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలె స్పెషల్ సీఎస్ లు జయేష్ రంజన్, వికాస్ రాజ్, సీవీ ఆనంద్, సంజయ్ కుమార్, మహేష్‌దత్ ఎక్కా, సబ్యసాచి ఘోష్, నవీన్ మిట్టల్, దాన కిషోర్, అహ్మద్ నదీమ్, తదితరులు హాజరయ్యారు.

'కాళేశ్వరం' తో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

- రెండేళ్ల పాలనచూసి ప్రజలు కాంగ్రెస్ వెంట ఉన్నారు
- కేసీఆర్, కేటీఆర్లకు ప్రజల సమస్యలు పట్టవు
- ప్రతిపక్షాలు మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 26 : కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో కోట్ల రూపాయాలు కమీషన్లు తీసుకొని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బీఆర్ఎస్ ప్రభుత్వం చిన్నాభిన్నం చేసిందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం గాంధీ భవన్లో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మీడియా సెల్ కన్వీనర్ సామ రామ్మోహన్ రెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో అప్పులు తీసుకువచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనికి రూ. 47వేల కోట్లు వడ్డీ రూపంలో చెల్లించాల్సి వచ్చిందని మంత్రి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం పేరుతో కమీషన్లు దండుకుందని అన్నారు. కాళేశ్వరంలో చేసిన అవినీతికి ఇతర దేశాల్లో అయితే కఠిన శిక్షలు విధించే వారని మంత్రి అన్నారు. మన రైతులకు సంబంధించి రైతు బంధు, మూసీ ప్రక్షళన గురించి ప్రధాన ప్రతిపక్ష నాయకులు మాట్లాడుతున్నారని మంత్రి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన పని వలన ప్రతి నెల రూ. 6వేల కోట్లు వడ్డీ కట్టాల్సిన పరిస్థితి ఏర్పాడిందని మంత్రి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్కు చేసిన అప్పుతో ఇప్పటికే రూ. 47వేల కోట్లు చెల్లించాలమని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. బీఆర్ఎస్ నేతలు ముఖ్యమంత్రితో పాటు ప్రభుత్వంపై బురద జల్లె ప్రయత్నం చేస్తున్నారని మంత్రి తెలిపారు. కాళేశ్వరం విషయంలో కేసీఆర్, కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనేక ముఖ్యమైన అంశాల విషయంలో ప్రత్యేకం మాట్లాడానికి ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ఏనాడు అసెంబ్లీకి రాలేదని అన్నారు. ప్రభుత్వంలో ఉన్న సమయంలో ఏనాడు ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. ప్రజాపాలనలో ప్రజలు తమ వెంట ఉన్నారని, రెండేళ్ల పరిపాలనతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం వెంట ఉన్నారని ఏలాగైన ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయాలని రాజ్యాంగ బద్దంగా ఉన్న ముఖ్యమంత్రిని ఏక వచనంతో కేటీఆర్ మాట్లాడుతున్నారని మంత్రి అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టె ప్రయత్నంలో భాగంగా కాళేశ్వరం వడ్డీలను తగ్గించడానికి ముఖ్యమంత్రి చొరవ తీసుకున్నారని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటిల్లో నాలుగు అమలు చేస్తున్నామని మరో రెండు గ్యారంటీలు అమలు చేస్తామని మంత్రి తెలిపారు.

జూబ్లీహిల్స్‌లో భారీ అగ్ని ప్రమాదం

- వస్త్ర దుకాణంలో ఎగిసిపడిన మంటలు
- మంటలు ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది
- ప్రాణాలతో బయటపడిన నలుగురు వ్యక్తులు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 26: నాంపల్లిలోని ఫర్నిచర్ దుకాణంలో జరిగిన అగ్నిప్రమాద విషాద ఘటన మరువక ముందే, ఫిబ్రవరి 20న అమీర్‌పేట మైత్రీవనం చౌరస్తాలోని ఆదిత్య ఎన్‌క్లేవ్ భవనంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో చిక్కుకున్నవారు ప్రాణాలతో బయటపడ్డారు. తాజాగా జూబ్లీహిల్స్‌లోని ఓ వస్త్రదుకాణంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36లోని ఓ వస్త్రదుకాణంలో జరిగిన అగ్ని ప్రమాదం కలకలం సృష్టించింది. చెక్‌పోస్ట్ మెట్రో స్టేషన్ సమీపంలోని ఓ వస్త్ర దుకాణం వెలపల అంటుకున్న మంటలు క్రమంగా నాల్గో అంతస్తు వరకూ వ్యాపించాయి. భవనానికి ముందు భాగంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన దేవాలయ నమూనా పూర్తిగా దగ్ధమైంది. గత కొంత కాలంగా స్టోర్ మూసి వేసి లోపల ఆధునీకరణ పనులు చేస్తున్నారు. వారం రోజులుగా నలుగురు అక్కడ పని చేస్తున్నారు. వారంతా మంటలు గమనించి అతి కష్టంమీద బయటకు వచ్చారు. మంటలు గమనించిన స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందిచారు. ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. ఘటనాస్థలంలో డీఆర్ఎఫ్, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సైతం చేరుకుని ఫైర్ సిబ్బందికి ఆటంకం కలగకుండా చూశారు. మొదటి అంతస్తులో పని చేస్తుండగా తొలుత మంటలు కింద అంటుకోగా, క్రమంగా నాల్గో అంతస్తు వరకూ వ్యాపించాయి. మంటలు చూసి వెంటనే అక్కడి నుంచి పై అంతస్తులకు వెళ్లారు. పొగలు దట్టంగా ఉండటంతో ఊపిరాడక ఇబ్బందులు పడ్డారు. చివరకు మొదటి అంతస్తులో భవన అద్దాలను పగలకొట్టి బయటపడ్డారు. మంటలు వచ్చిన వెంటనే తమతో పాటు ఉన్న ఓనర్ బయటకు వెళ్లిపోయాడని, తమను అప్రమత్తం చేసి ఉంటే ఇంకా ముందే బయటకు వచ్చేవాళ్లమని పని వాళ్లు చెబుతున్నారు. ఓ దశలో శ్వాస ఆడక చనిపోతామని భయమేసిందని వెల్లడించారు. మరోవైపు ఘటనాస్థలాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పరిశీలించారు. ఘటనపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునారావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మూడు ఫైర్ ఇంజన్లుతో మంటలు ఆర్పివేశాం

మూడు ఫైర్ ఇంజన్లుతో మంటలు ఆర్పివేశామని, ఘటనపై దర్యాప్తు చేస్తామని సికింద్రాబాద్ అగ్నిమాపక అధికారి రాజు తెలిపారు. భవనానికి అగ్నిమాపక శాఖ అనుమతులు ఉన్నాయో లేదో అని దర్యాప్తులో తెలుస్తుందని అన్నారు. మంటలను ఆర్పేందుకు సుమారు 30మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారని అయన వెల్లడించారు.

గాంధీ విగ్రహం కాదు.. విద్యార్థుల ఫీజు బకాయిలు ఇవ్వండి

- మార్చ్ 16 లోపు ఫీజుల బకాయిలు విడుదల చేయాలి
- లేదంటే వేలాది మంది విద్యార్థులతో అసెంబ్లీ ముట్టడిస్తాం
- బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి
- సీఎస్ కు వినతి పత్రం అందజేసిన బీసీ నాయకులు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 26: తెలంగాణ రాష్ట్రంలో ఫీజుల రియంబర్స్మెంట్ స్కాలర్ షిప్ లు రాక 22 లక్షల మంది పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, ఫీజుల రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయని ప్రభుత్వం, ఐదు వేల కోట్లతో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రయత్నించడం తగదని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలోని బీసీ ప్రతినిధుల బృందం గురువారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కే రామకృష్ణారావు తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఫీజుల రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని సీఎస్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం లో ఉన్న ఫీజుల బకాయిలను తామెందుకు చెల్లించాలని ప్రస్తుత ప్రభుత్వం బుకాయించడం మంచిది కాదన్నారు. తాము అధికారంలోకి రాగానే ఫీజుల రియంబర్స్మెంట్ విడుదలతో పాటు ప్రతి బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థులకు పూర్తి ఫీజులను చెల్లిస్తామని మాట ఇచ్చి రెండు సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నేటి వరకు ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం దురదృష్టకరం అన్నారు. యజమాన్యాలు ఫీజులు కట్టాలని ఒత్తిడి చేయడంతో తీవ్ర మానసిక క్షోభ కు గురై రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 22 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. ఫీజుల రియంబర్స్మెంట్ విషయంలో ఉద్యమాన్ని ఆపేది లేదని, త్వరలోనే రాష్ట్ర గవర్నర్, మంత్రులను, డిప్యూటీ సీఎం, సీఎంలను కలిసి విన్నవిస్తామని, సానుకూలమైన నిర్ణయం రాకుంటే మార్చి 16వ తేదీ నుండి జరిగే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వేలాది మంది విద్యార్థులతో అసెంబ్లీని ముట్టడిస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాసు ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మ, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మణిమంజరి సాగర్, బీసీ జేఏసీ కన్వీనర్ జాజుల లింగం గౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గౌడుగు మహేష్ యాదవ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్ గౌడ్, బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ బొల్లెపల్లి స్వామి గౌడ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు ఇంద్రం రజక, వినోద్ కుమార్, బండిగారి రాజు తదితరులు పాల్గొన్నారు.

"

అసైన్డ్ భూముల చట్ట సవరణకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు కొన్నిచోట్ల అసైన్డ్ భూములు అవసరం. అసైన్‌దారుల అనుమతితో లీజుకు తీసుకుంటాం. లీజుతో వారికి ఆదాయం వస్తుంది. ఎకరాకు ₹31వేలు చొప్పన ఇస్తాం. రెండేళ్లకోసారి 5% వరకు పెంచుతాం'. 10వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటవుతాయి, 7.5 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది.
- ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్

ఓపెన్ వాయిస్

ఏఐ సాంకేతికతతో ఈ ఓటింగ్!

భారత ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేయడంపై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించింది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనది. అయితే వలసలు, అనారోగ్యం లేదా ఇతర అనివార్య కారణాల వల్ల లక్షలాది మంది తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా బిహార్ రాష్ట్ర ఎన్నికల సంఘం 'కృత్రిమ మేధ' 'బ్లాక్‌చెయిన్' సాంకేతికతలతో కూడిన ఇ ఓటింగ్ విధానాన్ని తెరపైకి తెచ్చింది. 2026లో జరిగిన 'ఏఐ ఇంపాక్ట్ సమిట్'లో ఈ విధానాన్ని ప్రదర్శించి దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. ఇందుకోసం ఢిల్లీ భారత మండపంలో కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల జాతీయ రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. ఇది 27 ఏళ్ల తర్వాత కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులు మధ్య జరుగుతున్న రౌండ్ టేబుల్ సమావేశం. ఈవీఎంలు, ఓటర్ల జాబితాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ఎన్నికల ప్రక్రియలను బలోపేతం చేయడంపై అంశాలపై అధికారులు చర్చలు జరపనున్నారు. చివరిసారిగా ఇలాంటి సమావేశం 1999లో జరిగింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అధ్యక్షత వహిస్తారు. ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు డాక్టర్ వివేక్ జోషి సమక్షంలో ఈ సమావేశం జరుగుతుంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల రాష్ట్ర ఎన్నికల కమిషనర్లు, చట్టపరమైన, సాంకేతిక నిపుణులు పాల్గొంటారు. మొత్తం 36 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల నుంచి రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రధాన ఎన్నికల అధికారులు పాల్గొనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ల పనితీరు, ఎన్నికల ప్రక్రియలు, లాజిస్టిక్స్ ను పెంపొందించడం, నిర్మాణాత్మక ఆలోచనల మార్పిడికి ఎన్నికల నిర్వహణలో సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేయడం అంశాలపై చర్చలు జరగనున్నాయి. దేశవ్యాప్తంగా సర్ ప్రక్రియ సహా త్వరలో జమిలి ఎన్నికలపై చర్చ జరుగుతున్న నేపథ్యం కేంద్ర రాష్ట్ర ఎన్నికల అధికారుల సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ద్యోగాల కోసం ఇతర నగరాలకు వెళ్లే కార్మికులు, దూర ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులు, అలాగే శారీరక ఇబ్బందులు ఎదుర్కొనే వృద్ధులు, వికలాంగులకు ఈ విధానం ఒక వరంలా మారనుంది. పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే, తమ వద్ద ఉన్న స్మార్ట్‌ఫోన్ ద్వారానే సురక్షితంగా ఓటు వేసే వెసులుబాటును ఈ ఇఓటింగ్ యాప్ కల్పిస్తుంది. ఫేషియల్ రికగ్నిషన్: ఓటరు గుర్తింపు కార్డు డేటాబేస్ ఆధారంగా ముఖ గుర్తింపు ప్రక్రియ ద్వారా అసలైన ఓటరును గుర్తిస్తారు. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ: వేసిన ప్రతి ఓటు ఎన్‌క్రిప్ట్ చేయబడి బ్లాక్‌చెయిన్‌లో రికార్డ్ అవుతుంది. దీనివల్ల డేటాను ఎవరూ ట్యాంపర్ చేయడం లేదా మార్చడం అసాధ్యం. డిజిటల్ ఈవీఎం: స్మార్ట్ కాంట్రాక్ట్ వ్యవస్థ ద్వారా డిజిటల్ పద్ధతిలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. రిటర్నింగ్ అధికారి డిజిటల్ సిగ్నేచర్ ఉంటేనే డేటా డీక్రిప్ట్ అవుతుంది. ఓటు వేయడం ఇప్పుడు సులభం ఓటర్లు ముందుగా అధికారిక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఓటీపీ ద్వారా మొబైల్‌ను ధ్రువీకరించుకోవాలి. ఆపై ఎపిక్ కార్డు వివరాలు నమోదు చేసి, లైవ్ ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా తమను తాము ధ్రువీకరించుకున్న తర్వాత నేరుగా ఓటు వేయవచ్చు. ఈ ప్రక్రియ అంతా అత్యంత రహస్యంగా, పారదర్శకంగా సాగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఏదైనా కొత్త వ్యవస్థ అమల్లోకి వచ్చినప్పుడు కొన్ని ఇబ్బందులు సహజం. పాత ఫోటోలు స్పష్టంగా లేకపోవడం, ఇంటర్నెట్ అంతరాయాలు, డిజిటల్ అక్షరాస్యత లేకపోవడం వంటి సవాళ్లు ఉన్నప్పటికీ.. బిహార్ ఎన్నికల సంఘం నమూనా ఓటింగ్ ద్వారా ప్రజల్లో, రాజకీయ పార్టీల్లో నమ్మకాన్ని కలిగించగలిగింది. ఫలితాల లెక్కింపు కోసం కూడా ఏఐ ఆధారిత ఓసీఆర్ వ్యవస్థను వాడుతుండటం వల్ల మానవ తప్పిదాలకు తావు లేకుండా వేగంగా ఫలితాలు వెలువడనున్నాయి.. మరో వైపు ఏపీ, తెలంగాణ సహా 22 రాష్ట్రాల్లో ఓటర్ జాబితాలను సవరించబోతోంది. దీన్నే సర్ అని పిలుస్తున్నారు. అంటే.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అని అర్థం. ఈ సర్ ద్వారా.. కేంద్ర ఎన్నికల సంఘం.. ఓటర్ల జాబితాల్ని పూర్తిగా పరిశీలించి, తప్పులను సరిచేస్తుంది. అంటే ప్రక్షాళన చేస్తుందన్న మాట. ఇది ఏప్రిల్ నుంచి మొదలయ్యే ఛాన్స్ ఉంది. ఈ సర్ ప్రక్రియను ఈసీ.. ఇప్పటికే బీహార్‌లో పూర్తి చేసింది. మరో 9 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో పూర్తి చేస్తూ ఉంది. మిగతా 22 రాష్ట్రాలూ, కేంద్ర పాలిత ప్రాంతాల సంగతి చూడబోతోంది. ఇది పూర్తైతే.. ఓటర్ల జాబితాలో అక్రమాలు దాదాపు తొలగినట్లే అవుతుంది. అప్పుడు ప్రజల నుంచి పెద్దగా అభ్యంతరాలు రాకపోవచ్చు. 2027లో కేంద్రం జనాభా లెక్కల గణన ప్రారంభించాలి అనుకుంటోంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
శుక్రవారం
27.02.2026

భారత లోక్ సభ పితామహుడు గణేష్ వాసుదేవ్ మావలంకర్

యేచన్ చంద్ర శేఖర్
8885050822

దేశ స్వాతంత్ర్యానంతరం దేశంలో తొలి సార్వత్రిక ఎన్నికల (అక్టోబర్ 1951 ఫిబ్రవరి 1952) తర్వాత ఏర్పడిన భారతదేశంలోని తొలి లోక్‌సభ, మే 13, 1952న తన తొలి సమావేశాన్ని నిర్వహించి, తన పూర్తి ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకుని, ఏప్రిల్ 4, 1957న రద్దు చేయబడింది. ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలో, ఇది భారతదేశానికి ప్రాథమిక ప్రజాస్వామ్య, శాసన మరియు విధానపరమైన పూర్వాపరాలను ఏర్పాటు చేసింది. స్వతంత్ర భారతదేశపు మొదటి లోక్‌సభకు 1952 నుండి 1956 వరకు స్పీకర్ గా సేవలందించిన గణేష్ వాసుదేవ్ మావలంకర్ (జి.వి. మావలంకర్) "లోక్‌సభ పితామహుడు" (ఫాదర్ ఆఫ్ ది లోక్ సభ) గానే కాక 'దాదాసాహెబ్' అని కూడా గుర్తింపు పొందారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానాలను, నియమాలను, సంప్రదాయాలను రూపొందించడంలో కీలక పాత్ర పోషించినందుకు, భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఆయనను ఆ బిరుదుతో గౌరవించారు. సర్ అబ్దుర్ రహీం తర్వాత బ్రిటిష్ వలస పాలన నుండి స్వతంత్ర భారతావనికి అధికార బదలాయింపు (స్వాతంత్ర్యం) సందర్భంగా కీలకమైన పరివర్తన సమయంలో మావలంకర్ కోవాస్జీ జహంగీర్‌ను 66 నుండి 63 ఓట్ల తేడాతో ఓడించి 1946 జనవరి 24 నుండి 1947 ఆగస్టు 14 అర్ధరాత్రి వరకు వరకు కేంద్ర శాసనసభకు (Central Legislative Assembly) అధ్యక్షుడిగా (స్పీకర్) పనిచేశారు. ఆ తర్వాత కేంద్ర శాసనసభ రద్దయ్యి "భారత రాజ్యాంగ సభ" (Constituent Assembly) పూర్తి అధికారాలను చేపట్టింది. 1947 నవంబర్ 17 నుండి రాజ్యాంగ సభ (శాసనసభ) స్పీకర్ బాధ్యతలు చేపట్టిన ఆయన తరువాత 1952 మే 15న స్వతంత్ర భారత మొదటి లోక్‌సభకు మొట్టమొదటి స్పీకర్ గా ఎన్నికయ్యారు.

ఆదర్శవంతమైన స్పీకర్:
మావలంకర్ కేవలం ఒక రాజకీయ నాయకుడే కాదు, భారత ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు అయిన పార్లమెంటరీ వ్యవస్థ విధివిధానాలను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. స్పీకర్‌గా, ఆయన రూల్స్ కమిటీ, ప్రివిలేజెస్ కమిటీ, బిజినెస్ అడ్వైజరీ కమిటీ, ప్రైవేట్ సభ్యుల బిల్లులు మరియు తీర్మానాలపై కమిటీ మరియు జీతాలు మరియు భత్యాలపై కమిటీ వంటి వివిధ కమిటీలను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రశ్నోత్తరాల సమయం వంటి పద్ధతులను ప్రారంభించారు. లోక్‌సభకు స్వయం ప్రతిపత్తి (స్వతంత్ర సెక్రటేరియట్) ఉండాలనే ఆలోచనను ఆయన సమర్థించారు. అది ప్రభుత్వ నియంత్రణలో ఉండకూడదని నిర్ధారించారు. కాంగ్రెస్ నేపథ్యం ఉన్నప్పటికీ, ఆయన సభాధ్యక్షుడిగా నిష్పాక్షిక మధ్యవర్తిగా వ్యవహరించి ప్రతిపక్షాల మన్ననలను కూడా చూరగొని సభ గౌరవాన్ని నిలబెట్టారు. కాంగ్రెస్ సభ్యుడిగా నిస్సందేహంగా ఆ పార్టీ పార్టీ సభ్యుల పట్ల ఆయనకు సానుభూతి ఉన్నప్పటికీ, స్పీకర్ కుర్చీ నుండి ఆయన తీసుకున్న తీర్పులపై, ఆయన జారీ చేసిన ఆదేశాలపై, లేదా ఆయన కార్యకలాపాలను నిర్వహించిన తీరుపై ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు. సభలో అధికారపక్ష సభ్యులయినా ప్రతిపక్ష సభ్యులయినా సమన్యాయం అందించడం స్పీకర్‌గా తన అత్యంత పవిత్రమైన కర్తవ్యం అని ఆయన విశ్వసించేవారు. సభలో చర్చను



ఉన్నత స్థాయిలో ఉంచడంలో ఆయన సభ్యులకు సంపూర్ణ సహాయాన్ని అందించేవారు. సభ్యుల ప్రత్యేకతల గురించి అవగాహన కలిగిన ఆయన చర్చకు దోహదపడే వారికి అవకాశం కల్పించేవారు. యువ సభ్యులను గమనించి, బాగా రాణించమని వారిని ప్రోత్సహించేవారు. చర్చలు సందర్భోచితంగా కొనసాగి సానుకూల మరియు నిర్మాణాత్మక ఫలితాలు వచ్చేలా ఆయన సభను నడిపించారు. ఒకానొక సందర్భంలో, ప్రధాని నెహ్రూ ప్రభుత్వం ఆర్డినెన్స్‌లను ప్రకటించే ధోరణి పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి అనారోగ్యకరమైనదని ఆయన భావించినప్పుడు, ఆయన స్వయంగా నెహ్రూకు లేఖ రాయడానికి వెనుకాడలేదు. సమయం లేకపోవడం వల్ల ఆర్డినెన్స్‌లను జారీ చేయడం తప్పుడు సాంప్రదాయాలకు దారితీస్తుందని ఆయన హెచ్చరించారు. పార్లమెంటును ఒక "రబ్బర్ స్టాంప్" స్థాయికి తగ్గించకూడదని సూచించారు. ఆయన నిర్దేశించిన ముఖ్యమైన విధానాలు మరియు స్థాపించిన వివిధ కమిటీలు నేటికీ మనుగడలో ఉండడం ఆయన పరిణతికి తార్కాణంగా నిలుస్తుంది. సభ నిర్వహణలో ఆయన ప్రదర్శించిన కార్యదక్షత, నెలకొల్పిన సమున్నత విలువలు మరియు సత్సాంప్రదాయాలు ప్రతి ప్రజాస్వామ్యవాది మరియు పార్లమెంటేరియన్‌కు నేటికీ స్ఫూర్తిదాయకమైన వారసత్వాన్ని అందిస్తుంది. ఈ కారణంగానే ఫిబ్రవరి 27, 1956న ఆయన మరణించినప్పుడు, భారతదేశ పార్లమెంటరీ వ్యవస్థలో సమగ్రత మరియు ఉన్నత నైతిక ప్రమాణాలకు పునాదులు వేసిన వ్యక్తిగా ఆయనను పార్టీలకు అతీతంగా సభ్యులు జ్ఞాపకం చేసుకున్నారు.

ప్రోటోకాల్ ఉదాహరణ
ఒక సందర్భంలో ప్రధాని నెహ్రూ అత్యవసరంగా ఒక అధికారిక అంశం నిమిత్తమై తన పార్లమెంట్ కార్యాలయంలో చర్చించేందుకు రావలసిందిగా స్పీకర్ మావలంకర్ కు ఒక చీటీ పంపారు. అయితే "పార్లమెంటరీ సాంప్రదాయం ప్రకారం ప్రధానమంత్రి స్పీకర్ వద్దకు వచ్చి చర్చించాలి తప్ప స్పీకర్ ప్రధానమంత్రి వద్దకు రాకూడదు" అన్న సందేశంతో మావలంకర్ ఆ చీటీని ప్రధానికి తిరిగి పంపారు. కాగా స్పీకర్ మావలంకర్ ఒక అధికారిక పని నిమిత్తం ప్రధానమంత్రిని కలిసేందుకు వస్తానని చీటీ పంపగా, ప్రోటోకాల్ ప్రకారం తానే స్వయంగా స్పీకర్ కార్యాలయానికి వస్తానని ప్రధాని నెహ్రూ ఆ చీటీని తిరిగి పంపారన్న మరో కథనం కూడా ప్రచారంలో ఉంది.

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాత్ర
నవంబర్ 27, 1888న బరోడా (ఇప్పుడు వడోదర)లో జన్మించిన గణేష్ వాసుదేవ్ మావలంకర్ అహ్మదాబాద్‌లోని గుజరాత్ కళాశాల నుండి సైన్స్‌లో బి.ఎ. పట్టా మరియు 1912లో న్యాయవాద పట్టా పొందారు. చురుకైన సామాజిక కార్యకర్త అయిన మావలంకర్ ప్రముఖ న్యాయవాదిగా స్థిరపడ్డారు. మావలంకర్ గుజరాత్‌లో స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. ఆయన సర్దార్ వల్లభాయ్ పటేల్, మహాత్మా గాంధీ వంటి వివిధ జాతీయ నాయకులతో పాటు గుజరాత్‌లోని వివిధ సామాజిక సంస్థలతో కూడా అనుబంధం కలిగి ఉన్నారు. మావలంకర్ మహాత్మా గాంధీ నాయకత్వంలో సహాయ నిరాకరణ ఉద్యమంలో చేరిన తర్వాత భారత జాతీయ కాంగ్రెస్‌తో అనుబంధం ఏర్పరచుకున్నారు. ఉద్యమానికి ఆయన చేసిన కృషి కారణంగా 192122 మధ్యకాలంలో గుజరాత్ ప్రావిన్షియల్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా నియమితులయ్యారు. 'ఖైరా నోరెంట్' ప్రచారంలో మావలంకర్ కీలక పాత్ర పోషించారు. కరువు మరియు వరద సహాయ పనుల్లో ఆయన చురుకుగా పాల్గొన్నారు. ఆయనను 1946 జనవరిలో ఆరవ కేంద్ర శాసనసభ అధ్యక్ష పదవికి కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. కాంగ్రెస్ పార్టీ టికెట్ పై మావలంకర్ బొంబాయి నుండి రాజ్యాంగ సభకు ఎన్నికయ్యారు.

కీలక రచనలు
మావలంకర్ గుజరాతీ మరియు ఆంగ్ల భాషలలో పుస్తకాలను ప్రచురించారు. "మానవతన జర్న" అనే పేరుతో రచించిన పుస్తకంలో ఖైదీల గురించిన కథలు ఉన్నాయి. ఆయన కలం నుండి జాలువారిన 'సంస్మరణో'ను మహాత్మా గాంధీ జీవితాన్ని మరియు మహాత్మా గాంధీ నుండి ఆయన అందుకున్న సంభాషణలను గుర్తుచేసుకోవడానికి అంకితం చేశారు. "మై లైఫ్ ఎట్ ది బార్" అనే పుస్తకంలో, ఆయన బార్‌లో తన అనుభవాలను వివరించారు. ఆయన ఇతర రచనలలో "ఎ గ్రేట్ ఎక్స్‌పెరిమెంట్" మరియు "జి.వి. మావలంకర్ స్పీచెస్ అండ్ రైటింగ్స్" ఉన్నాయి.

(ఫిబ్రవరి 27, వాసుదేవ్ మావలంకర్ వర్ధంతి)

వ్యాసకర్త భారత్ స్కౌట్స్ & గైడ్స్,
తెలంగాణ మాజీ రాష్ట్ర కార్యదర్శి

కార్పొరేట్ కొమ్ముకాస్తున్న చట్టాలు!

వెంక గారి భూమయ్య
9848559863

అడవి అంటే కేవలం లెక్కకు సాధ్యపడే కొన్ని వేల చెట్ల సమూహం మాత్రమే కాదు, అది అనంతమైన జీవకోటికి ప్రాణాధారమైన ఒక అద్భుతమైన జీవన వ్యవస్థ. అది తరతరాలుగా ప్రకృతి ఒడిలో ఒదిగి ఉంటూ అడవిని దైవంగా భావించి పూజించే కోట్లాది మంది ఆదివాసీల ఊపిరి, వారి సంస్కృతికి మరియు అస్తిత్వానికి అసలైన ఆత్మగౌరవ ప్రతీక. కానీ నేడు అభివృద్ధి అనే ఆకర్షణీయమైన నినాదం మాటున పాలకులు అడవిని కేవలం కాసుల వర్షం కురిపించే ఒక ఆదాయ వనరుగా, పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకును సరఫరా చేసే యంత్రంగా చూడటం అత్యంత విచారకరమైన పరిణామం; కేంద్ర ప్రభుత్వం ఇటీవల వన సంరక్షణ చట్టానికి తెచ్చిన వివాదాస్పద సవరణలు పర్యావరణ పరిరక్షణ కోసం కాక, బడా పారిశ్రామిక వేత్తలకు మరియు వ్యాపార దిగ్గజాలకు అడవి భూములను ధారాదత్తం చేయడానికేనని క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. కేంద్రం తెచ్చిన వన సంరక్షణ ఏవం సంవర్ధన్ అధినియం రెండు వేల ఇరవై మూడు సవరణలు అడవి నిర్వచనాన్నే మార్చివేసి, ప్రభుత్వ రికార్డుల్లో లేని లక్షలాది హెక్టార్ల పచ్చని భూములను రక్షణ లేకుండా చేశాయి, వన సంరక్షణ అనే ముద్దులొలికే పేరుతో వలసవాద నాటి అణచివేత ధోరణులను మళ్లీ అమలు చేస్తూ, అడవి బిడ్డలకు రాజ్యాంగబద్ధంగా లభించిన హక్కులను కాలరాయడం అమానుషం. అడవిలో ఏ చిన్న మార్పు జరగాలన్నా అక్కడి స్థానిక గ్రామ సభల అనుమతి తప్పనిసరి అని ఘోషిస్తున్న రెండు వేల ఆరు నాటి అటవీ హక్కుల చట్టాన్ని ఈ కొత్త నిబంధనలు పూర్తిగా తుంగలో తొక్కుతున్నాయి; గ్రామస్తుల ప్రమేయం లేకుండానే ప్రైవేటు శక్తులకు ఎర్రవాసెన పరచడం ప్రజాస్వామ్య విలువలకే గొడ్డలిపెట్టు. పచ్చని అడవుల మధ్య వాణిజ్య తోటలను పెంచడం ద్వారా అటవీ సాంద్రత పెరుగుతుందని ప్రభుత్వం చెబుతున్న వాదనలు పక్కాగా ఒక పగటి కల మాత్రమే.. ఎందుకంటే లాభమే పరమావధిగా పనిచేసే సంస్థలు అడవిలో సహజ సిద్ధమైన చెట్లను కాపాడవు, అవి తమ కర్మాగారాలకు అవసరమైన కర్ర కోసం ఒకే రకమైన మొక్కలను నాటుతూ అడవి యొక్క వైవిధ్యతను సమాధి చేస్తాయి. దీనివల్ల పక్షులకు గూడు ఉండదు, వన్యప్రాణులకు ఆహారం దొరకదు, భూగర్భ జలాలు అడుగంటిపోయి ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది.. అడవిపై ఆధారపడి జీవించే దాదాపు ముప్పై కోట్ల మంది పేదల నోటికాడ కూడును లాగేసి, వారిని తమ సొంత భూముల్లోనే పరాయివారిని చేసే ఈ విధానం సామాజిక

అశాంతికి దారితీస్తుంది; వాతావరణ మార్పుల ధాటికి ప్రకృతి ప్రకోపాలు పెచ్చరిల్లుతున్న ఈ కాలంలో అడవులను కాపాడాల్సింది పోయి, వాటిని వ్యాపార వస్తువులుగా మార్చడం అంటే మన భవిష్యత్తును మనం చేజేతులా కాల్చుకోవడమే.. చట్టసవరణల ముసుగులో జరుగుతున్న ఈ దోపిడీని అరికట్టకపోతే, రాబోయే తరాలకు మనం ఇచ్చేది కేవలం రాతి వనాలు మరియు కాలుష్య కోరలే అని ఈ సంపాదకీయం హెచ్చరిస్తోంది. ప్రభుత్వం కేవలం కాగితం మీద అడవిని పెంచుతున్నామని చెప్పుకోవడానికే ఈ మార్పులు తెచ్చింది తప్ప, క్షేత్రస్థాయిలో ప్రకృతిని ప్రేమించే హృదయం ఇక్కడ ఎక్కడా కనిపించడం లేదు; అడవిని నాశనం చేసి అద్దాల మేడలు కట్టడం అభివృద్ధి అనిపించుకోదు, అది భావితరాల పట్ల మనం చేసే పెద్ద నేరం. ప్రకృతి ప్రసాదించిన ఈ పచ్చని సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యతను విస్మరించి, లాభార్జనే ధ్యేయంగా ముందుకు సాగడం ఆత్మహత్యతో సమానం; అడవి బిడ్డల గొంతును వినిపించే గ్రామ సభలను నిర్వీర్యం చేయడం ద్వారా ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది.. అడవి తన సహజత్వాన్ని కోల్పోతే, అది కేవలం భూమి మీద ఉన్న ఒక చెట్ల గుంపుగా మిగిలిపోతుందే తప్ప, మనుగడకు కావలసిన ప్రాణవాయువును, వర్షాలను అందించలేదని పాలకులు గుర్తించాలి.. ఈ నేల మీద జీవించే ప్రతి ప్రాణికి అడవిపై సమాన హక్కు ఉంటుంది, కానీ చట్టబద్ధమైన దోపిడీ ద్వారా ఆ హక్కును కాలరాయడం అమానుషం.

చట్టబద్ధమైన వంచన.. గ్రామ సభల అధికారంపై దాడి
కేంద్రం తెచ్చిన తాజా సవరణలు రెండు వేల ఆరు నాటి అటవీ హక్కుల చట్టం పునాదులనే కదిలిస్తున్నాయి. ఆ చట్టం ప్రకారం అడవి భూమిని దేనికైనా వాడాలంటే స్థానిక గ్రామ సభల ముందస్తు అనుమతి తప్పనిసరి. కానీ కొత్త నిబంధనలు ఈ ప్రజాస్వామ్య ప్రక్రియను దాటవేసి, అధికారుల నిర్ణయాలకే పెద్దపీట వేస్తున్నాయి. ఇది అడవి బిడ్డలను వారి సొంత గడ్డపైనే బానిసలుగా మార్చడమే. సరిహద్దు ప్రాంతాల్లో వంద కిలోమీటర్ల మేర ఎటువంటి పర్యావరణ అనుమతులు అవసరం లేదని చెప్పడం ద్వారా అటవీ సంరక్షణ నియమాలను ప్రభుత్వం పక్కన పెట్టింది. ఇది దేశ భద్రత పేరుతో ప్రకృతి విధ్వంసానికి పాల్పడటమే అవుతుంది.

వాణిజ్య తోటల వెర్రిమొలకలు.. పర్యావరణానికి ఉరితాడు
వన సంరక్షణ చట్టం రెండు వేల ఇరవై మూడు ప్రకారం ప్రైవేటు సంస్థలు అడవుల్లో తోటలు పెంచడాన్ని అటవీ పనిగానే గుర్తించారు. దీనివల్ల బడా కంపెనీలు అడవి భూములను తక్కువ ధరకే చేజిక్కించుకోవడమే కాకుండా, భారీగా రాయితీలు పొందుతున్నాయి. వారు నాటే ఏకజాతి తోటలు పర్యావరణానికి ఏమాత్రం మేలు చేయవు. అవి భూమిలోని తేమను పీల్చివేసి జీవవైవిధ్యాన్ని నాశనం చేస్తాయి. అడవిలో సహజంగా లభించే ఆహారం, ఔషధాలు అదృశ్యమై ఆదివాసీల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇది అడవిని రక్షించడం కాదు, కార్పొరేట్ సంస్థల లాభాల కోసం ప్రకృతికి ఉరితాడు బిగించడమే.

ప్రకృతి రక్షణ మనందరి బాధ్యత
బ్రిటిష్ వారి కాలం నాటి దోపిడీ ధోరణులను మళ్లీ అమలు చేస్తూ ప్రభుత్వం అడవిని వ్యాపార సరుకుగా మార్చడం గర్హనీయం. అభివృద్ధి అంటే అద్దాల మేడలు కాదు, ప్రకృతితో కలిసి జీవించడం. ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడాలి. వివాదాస్పద సవరణలను ఉపసంహరించుకొని, అడవి బిడ్డల హక్కులను మరియు గ్రామ సభల అధికారాన్ని పునరుద్ధరించాలి. లేదంటే ప్రకృతి ఆగ్రహిస్తే మనిషి ఉనికికే ముప్పు వాటిల్లుతుంది. అడవి లాభాల గని కాదు, అది మన ప్రాణవాయువుకు పునాది అని పాలకులు గుర్తించాలి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

ఉపాధి హామీ ఉసురు తీస్తున్న కేంద్రం

పూకె రామకృష్ణ దొర
9866073866

కేంద్ర ప్రభుత్వం 2023 జనవరి 1 నుండి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGS) కింద పనిచేసే కూలీలకు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (NMMS) యాప్ ద్వారా హాజరును తప్పనిసరి చేసింది. ఈ విధానం వల్ల కూలీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు పూటలా ఫొటోలతో ఉపాధి హామీ కూలీలు ఇబ్బంది పడుతున్నారు. పని ప్రారంభించినప్పుడు ఒకసారి, పని ముగిసిన తర్వాత (సుమారు 4 గంటల విరామం తర్వాత) రెండోసారి జియోట్యాగ్డ్, టైమ్‌స్టాంప్డ్ ఫొటోలను అప్‌లోడ్ చేయడం తప్పనిసరి.అని కేంద్రం నిబంధనలు పెట్టింది. ఏజెన్సీలో సరిగ్గా సిగ్నల్ లేక ఉపాధి హామీ సిబ్బంది కూలీలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఒకవేళ కేవలం ఒక పూట మాత్రమే ఫొటో అప్‌లోడ్ అయితే, ఆ రోజుకు సంబంధించి 50% వేతనం మాత్రమే అందుతుంది. అస్సలు ఫొటో అప్‌లోడ్ కాకపోతే ఆ రోజుకు వేతనం చెల్లించరు.ఏజెన్సీ గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సిగ్నల్ సరిగ్గా లేకపోవడం, సర్వర్లు మొరాయించడం వల్ల ఫొటోలు సకాలంలో అప్‌లోడ్ కాక కూలీలు నష్టపోతున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే మేట్లు (Supervisors) స్మార్ట్‌ఫోన్ల వాడకంపై అవగాహన లేకపోవడం మరియు అదనపు పనిభారం వల్ల కూడా సమస్యలు తలెత్తుతున్నాయి. కొత్త నిబంధనలు (2025): జూలై 2025లో జారీ చేసిన కొత్త మార్గదర్శకాల ప్రకారం, అప్‌లోడ్ చేసిన ప్రతి ఫొటోను గ్రామ పంచాయతీ స్థాయిలో 100% వెరిఫై చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కూలీల హాజరును పారదర్శకంగా ఉంచేందుకు ప్రభుత్వం ఈ డిజిటల్ విధానాన్ని తెచ్చినప్పటికీ, మౌలిక సదుపాయాల లోపం వల్ల పేద కూలీలు తమ కష్టార్జితాన్ని కోల్పోతున్నారని కార్మిక సంఘాలురాజకీయ పార్టీ లు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ కొత్త చట్టం కింద గ్యారంటీ పని దినాలను 100 నుండి 125 రోజులకు పెంచారు. 2026 కేంద్ర బడ్జెట్‌లో ఈ కొత్త పథకానికి సుమారు రూ. 95,692 కోట్లు కేటాయించారు. అయితే, 125 రోజుల పని కల్పించాలంటే కనీసం రూ. 2.30 లక్షల కోట్లు అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు: యన్ యమ్ యమ్ యస్ యాప్ ద్వారా రోజుకు రెండుసార్లు ఫొటోలు అప్‌లోడ్ చేయాలనే నిబంధన వల్ల కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ప్రకటించిన కనీస వేతనం కంటే తక్కువ వేతనాలు అందుతున్నాయని నివేదికలు చెబుతున్నాయి.కేంద్రం లో బిజెపి పార్టీ తెచ్చిన కొత్త నిబంధనలు ఉపాధి హామీ పథకం ఉసురు తీసి ఉరి వేస్తున్నాయని కూలీలు, పార్టీలు బడుగు బలహీన వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో (MGNREGS) పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్' (NMMS) యాప్ ద్వారా రెండు సార్లు ఫొటోలు తీయడం తప్పనిసరి చేయడంతో

కూలీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు నిజమే. ఉదయం ఒకసారి, పని ముగిసిన తర్వాత (కనీసం 4 గంటల విరామం తర్వాత) రెండోసారి ఫొటో తీయాలి. ఒకవేళ నెట్‌వర్క్ సమస్యల వల్ల లేదా మరే ఇతర కారణాల వల్ల ఒక్క ఫొటో మాత్రమే అప్‌లోడ్ అయితే, ఆ రోజుకు సగం వేతనం మాత్రమే అందుతుంది. అసలు ఫొటోలు అప్‌లోడ్ కాకపోతే వేతనం రాదు. మారుమూల గ్రామాల్లో ఇంటర్నెట్ సరిగ్గా లేకపోవడం వల్ల ఫొటోలు అప్‌లోడ్ కావడం ఆలస్యమవుతోంది. దీనివల్ల కూలీలు పని పూర్తి చేసుకున్న తర్వాత కూడా ఫొటోల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. ఫీల్డ్ అసిస్టెంట్లు లేదా మేట్లకు తక్కువ నాణ్యత గల ఫోన్ల వల్ల ఫొటోలు స్పష్టంగా రాకపోవడం, యాప్ సరిగ్గా పని చేయకపోవడం వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎండలో పనిచేసిన కూలీలు, ఫొటో తీయడానికి మళ్ళీ ఒకచోట చేరాల్సి రావడం వల్ల సమయం వృథా అవడమే కాక ఇబ్బందులకు గురవుతున్నారు. కూలీల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో ఆఫ్‌లైన్ మోడ్‌లో ఫొటోలు తీసి, సిగ్నల్ ఉన్న చోట అప్‌లోడ్ చేసే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించాలి. రెండు సార్లు ఫొటోలు తీసే కార్యక్రమం తక్షణమే రద్దు చేయాలనీ ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు.

(వ్యాసకర్త ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917
ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

దళితులకు ఉన్నత విద్య సర్కార్ లక్ష్యం

- ఎస్సీ విద్యార్థులకు సివిల్స్, గ్రూప్స్‌కోచింగ్
- హైదరాబాద్లోనే ఢిల్లీ స్థాయి సివిల్స్ కోచింగ్
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 26: ప్రతిభావంతులైన దళిత విద్యార్థులు అన్ని రంగాల్లో సమాన లభించాలంటే చదువు ఒక్కటే మార్గామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. దళితులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి తెలిపారు. బుధవారం దళిత కులాల సంఘాల నాయకులతో కలిసి లోయర్ ట్యాంక్ బండ్లోని అంబేద్కర్ భవన్, కాచిగూడ ఎస్సీ హాస్టల్ సందర్శించారు. ఈ సందర్భంగామంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ లోయర్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ భవన్ ను మోడర్న్ కోచింగ్ హబ్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. కాచిగూడ హాస్టల్ కాంప్లెక్స్‌ను రెసిడెన్షియల్ అకాడమిక్ సెంటర్‌గా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. సివిల్స్ కోచింగ్ కోరకు తెలంగాణ విద్యార్థులు ఢిల్లీ బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని మంత్రి తెలిపారు. దళిత విద్యార్థులు ఢిల్లీ వంటి ప్రాంతాల్లో కోచింగ్ తీసుకోవడం ఖర్చుతో కూడిన పని కావడంతో ఢిల్లీ స్థాయి సివిల్స్ కోచింగ్ సౌకర్యాలను హైదరాబాద్‌లోనే అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. రానున్న రోజుల్లో విద్యార్థుల కోసం కొత్త టెక్నాలజీతో డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేయడంతో పాటు అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ, రిటైర్డ్ సివిల్ సర్వెంట్స్ గెస్ట్ లెక్చర్స్ తీసుకోవడంతో పాటు మాక్ టెస్టులు, ఇంటర్వ్యూ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పై ప్రత్యేక శ్రద్ధ పెడతామని తెలిపారు. కోచింగ్ తీసుకునే అభ్యర్థుల కోసం హాస్టల్, మెస్, స్టడీ హాల్స్ వంటి పూర్తి సదుపాయాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు. కోచింగ్ సెంటర్ల ఒక హైదరాబాద్ కు మాత్రమే పరిమితం కాకుండ తెలంగాణలోని ప్రతి జిల్లాకు విస్తరించేలా దీర్ఘకాలిక ప్రణాళిక చేస్తామని మంత్రి తెలిపారు. కోచింగ్ సెంటర్లను అకాడమిక్ ఎక్సలెన్స్ సెంటర్స్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని మంత్రి అన్నారు. తమిళనాడు మోడల్‌లా అత్యాధునిక సదుపాయాలతో నూతన భవనాలు నిర్మాణం చేస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 26: రాష్ట్రంలో భారీగా ఐఏఎస్ల బదిలీలు జరిగాయి. ఈ మేరకు మొత్తం 45 మంది అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులను జారీ చేశారు. ఐటీ, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ కుమార్‌ను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ జల సరఫరా, గ్రామీణ పారిశుధ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేశారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శిగా ఎన్.శ్రీధర్‌ను నియమించారు. అలాగే గనులు, భూగర్భ శాఖల బాధ్యతలను అదనంగా కేటాయించారు. విపత్తు నిర్వహణ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఎం.దానకిశోర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. రాజకీయ వ్యవహారాల ప్రధాన కార్యదర్శిగా రాహుల్ బొజ్జా, సాగునీటి శాఖ కార్యదర్శిగా ఈ.శ్రీధర్‌ను నియమించారు. ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శిగా డాక్టర్ గౌరవ్ ఉప్పల్‌ను బదిలీ చేశారు. రాష్ట్ర మెడికల్ సర్వీసెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. మహబూబ్‌నగర్ కలెక్టర్ బి.విజయేంద్రను సామాజిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సంఘం కార్యదర్శిగా నియమించారు. అలాగే పలువురు జిల్లా కలెక్టర్లను కూడా మార్చారు.

బదిలీ అయిన ఐఏఎస్‌ల జాబితా

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ జల సరఫరా, గ్రామీణ పారిశుధ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్ కుమార్, ఫ్లాగ్‌షిప్ వెల్ఫేర్ & డెవలప్‌మెంట్ స్కీమ్స్, సీఎస్ఆర్‌ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సబ్యసాచి ఘోష్,

విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఎం. దాన కిశోర్, ఐటీ & పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శిగా ఎన్. శ్రీధర్, పొలిటికల్ శాఖ ప్రధాన కార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులయ్యారు. సాగునీటి, సీఏడీ శాఖ కార్యదర్శిగా ఈ. శ్రీధర్, ఫైనాన్స్ & ప్లానింగ్ శాఖ కార్యదర్శిగా డా. గౌరవ్ ఉప్పల్, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్‌కార్యదర్శి,ఎస్సీ అభివృద్ధి కమిషనర్‌గా బి. విజయేంద్ర, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా డి. దివ్య, తెలంగాణ భవన్ (న్యూఢిల్లీ) సమన్వయ ప్రత్యేక కార్యదర్శిగా అద్వైత్ కుమార్ సింగ్, ఎండోమెంట్స్ డైరెక్టర్‌గా ఎం. హనుమంతరావు, ఫైనాన్స్ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా సిక్తా పట్నాయక్, జనగాం జిల్లా కలెక్టర్‌గా సందీప్ కుమార్ ఝా, 3వ డిస్కమ్ సీఎండీగా ఎండి ముషరఫ్ అలీ ఫారూఖీ, లేబర్ శాఖ ప్రత్యేక కమిషనర్‌గా పమేలా సత్పతి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌గా అనురాగ్ జయంతి, కోఆపరేషన్ ప్రత్యేక కమిషనర్, రిజిస్ట్రార్‌గా రాహుల్ రాజ్ పీఎస్ లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐటీఈ,సీ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా భవేష్ మిశ్రా, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీగా జితేష్ వి. పాటిల్, జోగులాంబ గద్వాల్ జిల్లా కలెక్టర్‌గా రిజ్వాన్‌బాషా షేక్, ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా సంతోష్ బీఎం, నారాయణపేట జిల్లా కలెక్టర్‌గా ప్రతీక్ జైన్, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌గా స్నేహ శబరిష్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ జాయింట్ ఎండీగా పి. కాత్యాయిని దేవి, నారాయణపేట అదనపు కలెక్టర్‌గా జి. ఫణీంద్ర రెడ్డి, కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా చిత్ర మిశ్రా, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా గరీమా అగర్వాల్, వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా దీపక్ తివారీ, మెదక్ జిల్లా కలెక్టర్‌గా ప్రతిమా సింగ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా అంకిత్, హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా చాహత్ బాజ్‌పాయ్, మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌గా ఖుష్బూ గుప్తా, జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా మందా మకరందు, మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్‌గా ఫైజాన్ అహ్మద్, హైదరాబాద్ మెట్రో రైల్ జాయింట్ ఎండీగా శివేంద్ర ప్రతాప్, జీహెచ్ఎంసీ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌గా పర్మార్ పింకేష్‌కుమార్ లలిత్‌కుమార్, వికారాబాద్ అదనపు కలెక్టర్‌గా ఉమా శంకర్ ప్రసాద్, నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్‌గా జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్, మంచిర్యాల అదనపు కలెక్టర్‌గా పి. చంద్రయ్య, వరంగల్ అదనపు కలెక్టర్‌గా వైవీ గణేష్, సిద్ధిపేట అదనపు కలెక్టర్‌గా అబ్దుల్ హమీద్, నిర్మల్ అదనపు కలెక్టర్‌గా బి. వెంకటేశ్వర్లు, వనపర్తి అదనపు కలెక్టర్‌గా ఎన్. ఖీమ్యా నాయక్, ఇండస్ట్రీ, ఇన్వెస్ట్మెంట్ సెల్,స్పీడ్అదనపు సీఈఓగా కె. విద్యాసాగర్, ప్రజావాణి అదనపు నోడల్ అధికారిగా ఎం. సురేందర్ లను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులను జారీ చేశారు.

సైబర్ నేరాలపై పోలీసుల ప్రత్యేక దృష్టి

- మ్యూల్‌ఖాతాల గుర్తింపునకు 'ఆపరేషన్ క్రాక్ డౌన్'
- వేల సంఖ్యలో సైబర్ నేరాల లావాదేవీల గుర్తింపు
- సుల్తాన్‌బజార్ బ్యాంకులో అత్యధికంగా మ్యూల్ ఖాతాలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 26: డిజిటల్ మోసాల కట్టడికి రాష్ట్ర పోలీసులు కీలక ఆపరేషన్ నిర్వహించారు. సైబర్ నేరాలకు కీలకమైన మ్యూల్‌ఖాతాదారులను కట్టడి చేసేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సైబర్ నేరాల నెట్ వర్క్‌ను ఛేదించడమే లక్ష్యంగా 'ఆపరేషన్ క్రాక్‌డౌన్' పేరిట ప్రత్యేక కార్యాచరణను చేపట్టింది. మ్యూల్‌ఖాతాల గుర్తింపునకు చేపట్టిన ఈ కీలక ఆపరేషన్‌ను టీజీసీఎస్‌బీ రాష్ట్రంలోని 16 పోలీస్‌యూనిట్ల పరిధిలో ఏకకాలంలో నిర్వహించింది. 137 ప్రత్యేక బృందాలు ఆయా ప్రాంతాల్లోని బ్యాంకులకు వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఈ దర్యాప్తులో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రాథమికంగా మొత్తం 1,888 అనుమానిత మ్యూల్ ఖాతాల కేవైసీలను పరిశీలించారు. అయితే, ఇందులో దేశవ్యాప్తంగా 9,431 ఖాతాలు సైబర్ క్రైమ్‌కు సంబంధించిన లావాదేవీలతో ఉండగా, తెలంగాణలో 782 అకౌంట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కొన్ని మ్యూల్ ఖాతాల లావాదేవీలు వందల సంఖ్యలో డిజిటల్ మోసాల ఫిర్యాదులతో సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విశేషంగా హైదరాబాద్‌లోని సుల్తాన్‌బజార్ ప్రాంతంలో ఉన్న ఓ బ్యాంకుకు చెందిన ఖాతా ఏకంగా 496 సైబర్ నేరాలతో ముడిపడినట్లు తేలింది. దీని తర్వాత సూర్యాపేట జిల్లాలోని నాలుగు బ్యాంకుల్లో 298 అకౌంట్లు సైబర్ నేరాల్లో పాలుపంచుకున్నాయని తనిఖీల్లో వెల్లడైంది. కాగా, డీజీపీ శివధర్ రెడ్డి ఈ కార్యాచరణను చేపట్టిన టీజీసీఎస్‌బీ డైరెక్టర్‌శిఖాగోయల్, బృందాన్ని ఓ ప్రకటనలో అభినందించారు.

ఘనంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 26: చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు నియోజకవర్గంలోని మొయినాబాద్ మండల కేంద్రంలోని అంజనీదేవి గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు. భాజపా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆయన జన్మదినం సందర్భంగా కొన్ని చోట్ల ఉచిత వైద్య శిబిరాలను సైతం ఏర్పాటు చేశారు. చేవెళ్ల బాజాపా ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం మాట్లాడుతూ... ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మన ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నారని, ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తూ నిధుల సాధనలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. అనంతరం కొండా విశ్వేశ్వర్ రెడ్డి తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేసి, ప్రజల ఆశీస్సులతో మరింత సేవ చేయడానికి కట్టుబడి ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువత పాల్గొన్నారు.

కనుల పండుగగా తిరుమలనాథ స్వామి కళ్యాణం

- జనసంద్రంగా మారిన పరిసరాలు
- హాజరైన ఎమ్మెల్యే వేముల

ప్రతిపక్షం, చిట్యాల, ఫిబ్రవరి 26: నల్గొండ చిట్యాల మండలం పెద్దకాపర్తి గుట్టపై గల శ్రీ భూసమేత తిరుమలనాథ స్వామి కళ్యాణ మహోత్సవం గురువారం కనుల పండుగగా జరిగింది. హైదరాబాద్ నుండి, చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో కళ్యాణాన్ని తిలకించేందుకు విచ్చేశారు. గుట్టపైన పరిసరాలు జనసంద్రంగా మారాయి. ఆలయ చైర్మన్ ఓర్సు రాజ్ కుమార్, సర్పంచ్ కాటం వెంకటేశం, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పుల యాదమ్మ, చలమల్ల మధుసూదన్ రెడ్డి, జెల్ల నరసింహ, సాపిడి యాదగిరి ఏర్పాట్లు చేశారు. పెద్ద ఎత్తున విచ్చేసిన భక్తజనులకు కళ్యాణం అనంతరం పున్న రాములు భారతమ్మ దంపతులు అన్న ప్రసాద వితరణ జరిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కళ్యాణ మండపం చేరుకొని స్వామివారికి ఎమ్మెల్యే పట్టు వస్త్రాలు సమర్పించారు. తిరుమలనాథ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. చిట్యాల మున్సిపల్ ఛైర్ పర్సన్ పందిరి గీత రమేష్, మాజీ ఛైర్మెన్ కోమటిరెడ్డి చిన వెంకటరెడ్డి, జెర్రిపోతుల సత్యనారాయణ, నాయకులు గుండెబోయిన సైదులు, దేశపాక రాజేష్, ఏర్పుల నరసింహ, ఏదుల్ల అజిత్ రెడ్డి, రమణారెడ్డి, పొట్లపల్లి కిరణ్, నీలకంఠం లింగస్వామి, నీలకంఠం నరేష్, గుజ్జరి యాదగిరి, గుండెబోయిన నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

ప్రతిపక్షం,మొయినాబాద్, ఫిబ్రవరి 26: నూతనంగా ఎన్నికైన మొయినాబాద్ మున్సిపాలిటీ పాలకవర్గ చైర్మన్,వైస్ చైర్మన్ మరియు కౌన్సిలర్ సభ్యుల ప్రమాణ స్వీకారం మహోత్సవం శుక్రవారం ఉదయం 11:00 గంటలకి మొయినాబాద్ మండల పరిధిలోని అంజనా దేవి గార్డెన్ (ఫంక్షన్ హాల్)లో నిర్వహించడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తమ్మలి మాణయ్య అన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ,ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి,మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి,మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ అనిత రెడ్డి ,స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య,చేవెళ్ల కాంగ్రెస్ ఇంచార్జ్ పామేనా భీమ్ భరత్ ,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి ,ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీమ్ లు హాజరుకానున్నారని తెలిపారు. మండల పరిధిలో ఉన్న కాంగ్రెస్ పార్టీ సహకార సంఘం చైర్మన్,మాజీ జెడ్పిటిసిలు,మాజీ ఎంపీపీలు,జిల్లా నాయకులు,మండల నాయకులు, మున్సిపాలిటీ కౌన్సిలర్ అభ్యర్థులు,సర్పంచులు ఎంపీటీసీలు,మాజీ ఎంపీటీసీలు,మాజీ సర్పంచులు,మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు,కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు,కార్యకర్తలు,పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

పొట్లపల్లి రాజన్న హుండీ ఆదాయం 6.47 లక్షలు

ప్రతిపక్షం, హుస్నాబాద్, ఫిబ్రవరి 26: దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం మహాశివరాత్రి జాతర సందర్భంగా పొట్లపల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయ మండపంలో హుండీల లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం రూ.6,47,739 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ సిద్దిపేట జిల్లా పర్యవేక్షకులు పట్లోళ్ల విజయలక్ష్మి పర్యవేక్షించారు. మహాశివరాత్రి జాతర ఉత్సవ కమిటీ సభ్యులు, సర్పంచ్, వార్డు సభ్యులు, గోమాత సేవా సమితి ప్రతినిధులు, ఆలయ అర్చక సిబ్బంది, శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

ప్రతిపక్షం, హుస్నాబాద్, ఫిబ్రవరి 26 : హుస్నాబాద్ పట్టణంలోని సిద్దేశ్వర గుట్టపై వెలసిన అయ్యప్ప ఆలయ 24 వ వార్షికోత్సవ మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యవచనం, అయ్యప్ప స్వామి పంచామృత అభిషేకం, విశేష పూజలు, అగ్ని ప్రతిష్ట, దేవతా హోమం, శ్రీ ధర్మశాస్త్ర మూలమంత్ర పారాయణం నిర్వహించారు. దివ్య పదినిమిట్టాంబడి మెట్ల పూజ భక్తి శ్రద్ధలతో సాగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఆకుల వెంకట్, మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత, సుద్దాల చంద్రయ్య, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఐలేని అనిత, కమిటీ సభ్యులు సురేందర్ రెడ్డి, కొండ్ల సంపత్, శ్రీకాంత్, వడ్డేపల్లి వెంకటరమణ, బై వెంకటేష్, ఐత శ్రీధర్, వెన్ శెట్టి శివ, బుర్ర ప్రవీణ్, కౌన్సిలర్లు కొండ రజిత, వైద్యం కిరణ్, పిల్లి తిరుపతి, మహిళా భక్తులు హేమలత, రాణి తదితరులు పాల్గొన్నారు.

సుందరగిరి శివాలయంలో వైభవంగా నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట

ప్రతిపక్షం, చిగురుమామిడి, ఫిబ్రవరి 26: మండలంలోని సుందరగిరి గ్రామ శివాలయంలో నవగ్రహ, సూర్యభగవాన్, నాగేంద్ర స్వామి, జంటనాగులు, పార్వతీదేవి విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా సాగాయి. అర్చకులు ధనగూరి మఠం విజయ్‌కుమార్ స్వామి, మణికంఠ స్వామి ఆధ్వర్యంలో గణపతి పూజ, రక్షాబంధనం, పుణ్యాహానం, మండపారాధన, కలశస్థాపన, యాగశాల ప్రవేశం తదితర కార్యక్రమాలను భక్తుల సమక్షంలో నిర్వహించారు. వేదపండితుల చేత ప్రత్యేక హోమాలు, పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ బాకం ఆంజనేయులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు సమన్వయం చేశారు. నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట సందర్భంగా గ్రామానికి చెందిన జంగ మధు, నల్లగొని సురేష్ గౌడ్, జంగ భూపాల్ రెడ్డి, గందే రమేష్, పత్తెం వెంకన్నల కుటుంబ సభ్యులు ఉమ్మడిగా రూ. లక్షను ఆలయ కమిటీకి అందజేశారు. నవగ్రహ విగ్రహాలను గంగు కుమార్, జంటనాగుల విగ్రహాన్ని బాకం వీరేశం, పార్వతీదేవి, సూర్యభగవాన్ విగ్రహాలను గైని శ్రీకాంత్ అందజేశారు. దాతలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సర్పంచ్ జంగ శిరీష వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీమూర్తి రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన భక్తులను శాలువాలు కప్పి సత్కరించారు.భక్తులకు బాకం శారద వీరేశం, గంగు మౌనిక కుమార్ ఆధ్వర్యంలో మహా అన్నప్రసాదాన్ని పెద్దఎత్తున ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

“

తిరుమల లడ్డూ అంశంపై శాసన మండలిలో మార్చి 4న లఘు చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. లడ్డూ అంశంపై దేవదాయ శాఖ మంత్రి స్టేట్మెంట్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తే వైసీపీ సభ్యులు అడ్డుతగలడం సరికాదు. కేవలం సభకు రావాలి, అల్లరి చేయాలి, బట్ట కాల్చి మీద వేయాలనే ధోరణితో వస్తున్నారు. తర్వాత వాక్ అవుట్ చేసి పోతున్నారు. వైసీపీ వాక్ అవుట్ పార్టీగా మారిపోయింది.

- ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రాంతీయం

హనుమకొండ కలెక్టర్‌గా చాహత్ బాజ్‌పాయ్

ప్రతిపక్షం, ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 26: హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్‌గా చాహత్ బాజ్పాయ్ ని ప్రభుత్వం నియమించింది. ఆమె గతంలో మొదట కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ గా, అనంతరం హనుమకొండ జిల్లా మున్సిపల్ కమిషనర్ గా సమర్ధవంతంగా విధులు నిర్వహించారు. కాగా ఆమె భర్త కర్నాటి వరుణ్ రెడ్డి టీజీయస్ పీడీసీల్ సిఎండి కావడం గమనార్హం. ఆయన కూడా తన పదవిని సమర్ధంగా నిర్వహిస్తున్నారు. వీరి ఇరువురు హనుమకొండ జిల్లా ప్రగతికి తోడ్పడనున్నారని పలువురు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

గీతంలో 'ప్రమాణ' కోసం సర్వం సిద్ధం

- ప్రతిభ, అనుభవపూర్వక అభ్యాసంతో అబ్బురపరచనున్న వార్షిక వేడుక

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 26 : ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వార్షిక ఉత్సవం 'ప్రమాణ 2026'ను హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఈనెల 27, 28 తేదీలలో నిర్వహించనుంది. డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ మార్గదర్శనంలో స్టూడెంట్ ఆర్గనైజింగ్, లీడర్ షిప్ కమిటీ ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తుంది. ముందస్తు వేడుకలతో ఈ యేడాది ప్రమాణ ఆరంభమైంది. ఇందులో నృత్య, పాటల పోటీలు, ఆటో ఎక్స్‌పో, ముఖాముఖి చర్చలను ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఈ ఈవెంట్లు అన్నింటిలో హైదరాబాద్ ప్రాంగణ అధికార మస్కట్ రోరోను ప్రదర్శిస్తున్నారు. ఇక తొలిరోజు ప్రమాణ 2026 ఆటో ఎక్స్‌పోతో శుభారంభం కానుంది. ది డెక్కన్ ప్రాజెక్ట్, ది హెడ్ లైనర్ బ్యాండ్, ప్రముఖ నేపథ్య గాయని గీతా మాధురి ప్రదర్శనతో పాటు డీజే నందజీ యొక్క హైఎనర్జీ డీజే సెట్ వంటివి అలరించనున్నాయి. చివరి రోజు, ఈనెల 28న, కశ్యప్ ప్రదర్శనలు, డీజే స్వాట్రెక్స్ యొక్క అద్భుతమైన ఈడీఎం ప్రదర్శనను ప్రేక్షకులు వీక్షిస్తారు. వాటికి నృత్యం, సంగీతం, నాటకం, సాంస్కృతిక యుద్ధాలు వంటి ఉన్నత స్థాయి పోటీలు జతకలుస్తాయి. వీటికి అదనంగా, 'మూడు రోజులు - మూడు అనుభూతులు' పేరిట మోటార్ స్పోర్ట్స్, గ్లామ్ అండ్ గాలా, ప్రధాన పాత్ర వంటి ఇతివృత్తాలతో నిర్వహిస్తున్నారు. 'ప్రమాణ ఉత్సవం కంటే ఎక్కువ. ఇది ఆచరణతో కూడిన అనుభవపూర్వక అభ్యాసం. ప్రణాళిక, బడ్జెట్, అమలు, సమన్వయం, సమయ నిర్వహణ వంటి విద్యార్థుల భవిష్యత్తు కెరీర్ కు అవసరమైన అన్ని ప్రధాన జీవన నైపుణ్యాలను ఆచరణాత్మకంగా నేర్చుకుంటారు. మరీ ముఖ్యంగా, ఆనందాన్ని ఆస్వాదిస్తూ నేర్చుకోవడం ఈ వేడుక ప్రత్యేకత. బాధ్యత, వేడుకల సమతుల్యత ప్రమాణకు నిజమైన నిర్వచనం' అని ప్రమాణ విస్తృత ప్రభావాన్ని క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ వివరించారు. మొత్తంమీద, ప్రతిభ, నాయకత్వం, అభ్యాసం వంటివి తరగతి గదికి మించి నేర్చుకునే శక్తివంతమైన వేదికగా ప్రమాణ 2026 నిలుస్తుంది.

ఇష్టపడి చదవండి..లక్ష్యాన్ని సాధించండి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస నిపుణులచే ప్రత్యేక తరగతులు ప్రారంభం
- 8 వేల మంది విద్యార్థులకు సొంత నిధులచే ప్రత్యేక మోటివేషన్ క్లాసులు
- పరీక్షా సామాగ్రి పంపిణీ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 26 : ప్రతి విద్యార్థి జీవితంలో 10వ తరగతి పరీక్షలు అత్యంత కీలకమని, ఇష్టపడి చదివి.. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. గురువారం పటాన్ చెరు పట్టణంలోని ఫంక్షన్ హాల్లో పటాన్ చెరు , జెపి కాలనీ డివిజన్లతో పాటు ఇస్నాపూర్ మున్సిపాలిటీ, ఇంద్రేశం మున్సిపాలిటీ, పటాన్చెరు మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి విద్యనభ్యసిస్తున్న 3000 వేల మంది విద్యార్థినీ విద్యార్థులకు తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ వికాస ప్రేరణ తరగతులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన పదవ తరగతి పరీక్ష సమయంలో ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి అన్న అంశంపై ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు చంద్రయ్యచే ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షలు పూర్తయ్యే వరకు ఇంట్లో ఫోన్లు, టీవీలకు పిల్లలను దూరంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సొంత నిధులచే కొనుగోలు చేసిన పరీక్ష మెటీరియల్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగేశ్వర రావు నాయక్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, ప్రైవేట్ పాఠశాలల హెడ్ మాస్టర్లు, కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్‌లో దాష్టికం

- విద్యార్థిని చితకబాదిన వార్డెన్
- తీవ్రంగా గాయపడిన విద్యార్థి
- బీడీఎల్ భానూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు. కేసు నమోదు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 26 : నారాయణ స్కూల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిపై వార్డెన్ పైపుతో కొట్టడంతో గాయాలు అవ్వగా బీడీఎల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విద్యార్థి తల్లి వివరాల మేరకు హైదరాబాద్ నగరంలోని షేక్ పేటకు చెందిన లలిత కుమారుడు గాదం ప్రదయ్ విదేష్‌ను మండలంలోని నందిగామ శివారులో గల నారాయణ స్కూల్లో పదవ తరగతి చదువుతున్నాడు. కాగా గురువారం ఉదయం దోబి డే ఉండటం వల్ల ఉదయం ఆలస్యంగా స్నానం చేస్తున్నాడని పైపుతో ప్రదయ్ విదేష్ పై వార్డెన్ లాలు త్రినాథ్ పైపుతో కొట్టడంతో కుడి చెయ్యి బొటనవేలు విరిగి వద్ద గాయం అయింది. అదే కాకుండా కాళ్లు, తొడలపై, శరీర ఇతర భాగాలపై కొట్టడం జరిగింది. గత వారం రోజుల క్రితం ఇలాగే కొడితే బాగుండదని తల్లి వాగ్వివాదానికి దిగినట్లు, మరో సారి తప్పు జరగదని యాజమాన్యం విద్యార్థి తల్లిని నచ్చజెప్పి పంపించారు. గురువారం ఉదయం ఆలస్యంగా బాత్ రూమ్ లో స్నానం చేస్తున్నాడనే విషయం ప్రిన్సిపాల్ చూసి వార్డెన్ కు చెప్పడంతో వార్డెన్ త్రినాథ్ విద్యార్థిపై దాడి చేశారు. విషయం తెలిసి ఇదేంటని అడిగిన తల్లి లలిత ప్రిన్సిపల్ నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వడంతో బీడీఎల్ బానూర్ పోలీస్ స్టేషన్ లో విద్యార్థి తల్లి లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రపంచ దేశాలపై అమెరికా సామ్రాజ్యవాద దాడి

- అమెరికా సామ్రాజ్య వాదానికి తలొగ్గి దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్న మోడీ ప్రభుత్వం
- కార్మిక, కర్షకుల సమస్యలపై పోరాటాలు ఉధృతం: సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు
- సంగారెడ్డిలో జరిగిన సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 26 : ప్రపంచ దేశాలపై అమెరికన్ సామ్రాజ్యవాద దాడి పెరుగుతుందని, అమెరికా సామ్రాజ్య వాదానికి తలొగ్గి దేశ ప్రయోజనాలను మోడీ ప్రభుత్వం తాకట్టు పెడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. గురువారం రోజు సంగారెడ్డి కేవల్ కిషన్ భవన్ లో సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభ సూచికంగా జెండావిష్కరణ చేయడం జరిగింది . ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ కార్మిక, కర్షకుల సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. దేశంలో బిజెపి ఆధీనంలోని మోడీ ప్రభుత్వం రైతాంగ ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెట్టిందని అన్నారు. అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలతో దేశానికి జరిగే ప్రయోజనం ఏమీ లేదన్నారు. పైగా ఆ ఒప్పందాల ప్రభావం దేశంలోని కార్మికులు, రైతులపై ఉంటుందని తెలిపారు. అమెరికాతో చేసుకుంటున్న ట్రేడ్ ఒప్పందాల వివరాలను ఇప్పటివరకు పార్లమెంట్ కు గానీ, దేశ ప్రజలకు గానీ తెలియజేయలేదని విమర్శించారు. ఈ చర్య దేశీయ పరిశ్రమలు, ఉపాధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. అన్ని వర్గాల జీవనోపాధిపై దాడి జరుగుతుందని అన్నారు. ఈ ఒప్పందాలపై మోడీ ప్రభుత్వం మౌనం వహించడం దేశాన్ని అవమానపరచడమే కాక ప్రజాస్వామ్యానికి తీవ్రమైన హాని అని పేర్కొన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం ప్రజల మధ్య వైశమ్యాలను పెంచి పోషిస్తుందని, మతాల మధ్య అగ్గి రాజేస్తూ వాటి మధ్యలో కూర్చొని చలికాచుకుంటుందన్నారు. దేశంలో లౌకికవాదాన్ని మంట కలుపుతూ మత ఉన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజా సమస్యలను దారిమల్లిస్తూ నియంతలాగా దేశాన్ని మోడీ పరిపాలిస్తున్నారని వాపోయారు. దేశంలోని ఆదాని అంబానీ లాంటి బడా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ భారతదేశ సంస్థలన్నింటినీ వారికి తాకట్టు పెడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తుందన్నారు. అమెరికా అధ్యక్షులు మన దేశ అంతర్గత విషయాల్లో పెత్తనం చేస్తూ ఉంటే నోరు ఎత్తడం చేతకాని ప్రభుత్వమని చెప్పారు. మోడీ ఓ పక్క మతోన్మాదాన్ని మరోపక్క కార్పొరేట్ వ్యక్తులను అడ్డుపెట్టుకొని దేశంలో పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. దేశంలోని పార్లమెంట్లో ప్రజా సమస్యలు చర్చకు రావడం లేని మోడీ తనకు అనుకూలమైన బిల్లులు పాస్ చేయించుకొని పార్లమెంటు మూసేస్తున్నాడని విమర్శించారు. బిజెపి విధానాలను వ్యతిరేకించడంలో కాంగ్రెస్ విఫలమైందని అన్నారు. ఎర్ర జెండా ఆధ్వర్యానా ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామన్నారు. పార్లమెంట్ సాక్షిగా ఉపాధి హామీ చట్టాన్ని నేరుగార్చారని పేద కూలీల పొట్ట కొడుతున్నారని కూలీలను మభ్యపెట్టి రాముని పేరుతో భజన చేస్తున్నారని ఈ విషయంలో కాంగ్రెస్ సరైన తీరులో స్పందించకపోవడం శోచనీయమన్నారు. రైతాంగానికి ఉచిత విద్యుత్తు గృహాలకు పేదలకు దళిత గిరిజనులకు ఉచిత విద్యుత్తు రద్దు చేసేందుకే విద్యుత్ సవరణ బిల్లు తీసుకొచ్చారని ఇది రైతాంగం మనుగడకు ముప్పని అన్నారు. అను విద్యుత్ ఉత్పత్తిని ప్రైవేటుపరం చేసి దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టేందుకే శాంతి బిల్లు తెచ్చారని ఇది ప్రమాదకరమైన ది అన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, మాణిక్, సాయిలు, నర్సింలు, నాయకులు నాగేశ్వర్ రావు, మహిపాల్, లలిత , యాదగిరి, కృష్ణ, విద్యా సాగర్, పాండు రంగారెడ్డి, వాజిద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 26 : బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. గురువారం ఇంటర్ సెకండియర్ పరీక్ష కొనసాగగా, విద్యార్థుల హాజరు గురించి కలెక్టర్ ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా? అని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ప్రథమ చికిత్స సదుపాయం, ఏ.ఎన్.ఎం, టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి కాపీయింగ్ కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచీలు వంటి ఉపకరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలలో సత్తా చాటిన కామారెడ్డి జిల్లా క్రీడాకారులు

- కలెక్టర్ చొరవతో జిల్లాకు పతకాల పంట

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, ఫిబ్రవరి 26: జిల్లా కలెక్టర్ చొరవతో జిల్లా లోని వివిధ క్రీడాకారులకు రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పతకాలు వరించాయ. రాష్ట్ర స్థాయి సీఎం కప్ 2025 సెకండ్ ఎడిషన్ లో భాగంగా గోల్డ్ మెడల్స్ 7, సిల్వర్ మెడల్ 8, కాంస్య పతకాలు 7, బాల్ బ్యాట్మెంట్ లో రాష్ట్రం లో ప్రథమ స్థానంతో పాటు లక్షరూపాయలు నగదు, బాలురు అండర్ 20 రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం 75 వేల రూపాయల నగదు, సెపక్ థాక్రా మహిళల విభాగం లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి, 75 వేల రూపాయల నగదు సాధించారు. హాకీ అండర్ 19 లో బాలికల విభాగం లో రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి తో పాటు 50 వేల రూపాయల నగదు, నెట్ బాల్ అండర్ 19 లో బాలుర విభాగం లో రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి 50 వేల రూపాయల నగదు బహుమతి జిల్లా క్రీడాకారులు పొందారు. జిల్లా స్థాయి పోటీలకు, నిర్వహణకు భోజన వసతులకు సంబంధించి ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఫండ్ కింద 2 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ పథకాలు సాధించిన క్రీడాకారులు ఆర్థిక సహాయంగా ముగ్గురు పరుశురాం, ఆనంద్, ఈశ్వర్ లకు ఒక్కొక్కరికి 25 వేల రూపాయల చొప్పున 75 వేల రూపాయలు గత డిసెంబర్ లో ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కలెక్టర్ ప్రత్యేకంగా చొరవచూపి జిల్లాకు పతకాల సాధించే విధంగా కృషి చేశారు. జిల్లాకు ఇన్ని పథకాలు సాధించిన సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. ప్రతీ సారి పథకాలు సాధిస్తూ క్రీడా హబ్ గా మార్చడానికి అన్ని క్రీడాసంఘాలు కృషి చేయాలని కోరారు. లాంగ్ జంప్ జావలింగ్ త్రో బంగారు పతకం పరుశురాం , 800 మీటర్స్ ఈశ్వర్ సిల్వర్, లాంగ్ జంప్ శ్రీనిధి వెండి పథకం, జావలింగ్ త్రో ఈశ్వర్ ప్రసాద్, కాంస్య పతకం, అమృత, కాంస్య పతకం, బాక్సింగ్ స్వేటిజ 48 కేజీల విభాగం లో బంగారు పతకం, రోయింగ్ అండర్ 14 బాలికలు డబుల్స్ లో బంగారు, సింగ్ లో వెండి పతకం విద్యాసాయి సాధించారు. యోగా లో సహస్ర, సింధు జా, సునీత బంగారు పతకాలు, సిల్వర్ కవిత, శిరీష, కుస్తీ పోటీలలో ప్రభాస్, భాస్కర్ సిల్వర్, జ్యోతి, అనిల్, ప్రవీణ్ కాంస్య పతకాలు, కరాటే లో వంశీ సిల్వర్ , రోహిత్ కాంస్య పతకం, క్యారమ్ డబుల్స్ లో ప్రణయ్, రాజు కాంస్య పతకం లు సాధించి జిల్లాకు రోల్డ్ మోడల్ గా నిలిచారని కలెక్టర్ అభినందించారు. పైన తెలిపిన వ్యక్తిగత క్రీడలలో బంగారు పథకానికి 20 వేల రూపాయలు వెండి పథకానికి 15 వేల రూపాయలు కాంస్య పతకం నకు 10 వేల రూపాయలు మొత్తంగా 6 లక్షల 89 వేల రూపాయలు, ట్రోఫీ తో పాటు నగదుగా పొందడం జరిగింది. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ విక్టర్, dyso రంగ వెంకటేశ్వర గౌడ్, dieo సలాం, అన్ని క్రీడా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణానికి సహకరించండి

- తోషిబా యాజమాన్యాన్ని కోరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 26: పటాన్ చెరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, హాస్టల్ భవనాల నిర్మాణాలకు సిఎస్ఆర్ నిధులు కేటాయించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తోషిబా యాజమాన్యాన్ని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం ఉదయం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం లో గల తోషిబా పరిశ్రమ యాజమాన్యం ప్రతినిధులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులకు పరిశ్రమ యాజమాన్యం సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ప్రధానంగా ఇటీవల పటాన్చెరు నియోజకవర్గానికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు కావడం జరిగిందని.. శాశ్వత ప్రతిపాదికన అమీన్ పూర్ పరిధిలోని సర్వేనెంబర్ 993లో కళాశాల భవనం, హాస్టల్ భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని తెలిపారు. నిధుల కొరత మూలంగా భవన నిర్మాణ పనులు ముందుకు కొనసాగడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కళాశాల మరియు హాస్టల్ భవన నిర్మాణాల కోసం 45 కోట్ల 70 లక్షల రూపాయలతో ప్రభుత్వ ఇంజనీరింగ్ అధికారులు అంచనాల రూపొందించడం జరిగిందని వారి దృష్టికి తీసుకెళ్లారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గ పరిధిలోని పారిశ్రామిక రంగానికి అత్యంత ఆవశ్యకమైన ఇంజనీర్లను తయారు చేయడంలో పాలిటెక్నిక్ కళాశాల కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్ భవనాల నిర్మాణ కోసం పరిశ్రమ సిఎస్ఆర్ నిధులు కేటాయించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పరిశ్రమ యాజమాన్యాకి విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు, మున్సిపాలిటీలు, డివిజన్లో పరిధిలో పారిశుధ్య నిర్వహణలో కీలకమైన వాహనాల కొనుగోళ్లకు సైతం సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన పరిశ్రమ యాజమాన్యం ప్రతినిధులు అతి త్వరలో యాజమాన్యంతో చర్చించి సిఎస్ఆర్ నిధులు కేటాయించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమ సిఎండి హిరోషి ఫురుట, డైరెక్టర్ మానవ వనరుల విభాగం కట్సుతోషి మారుమోతో, హెచ్ ఆర్ రామ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



గంగ-కావేరీ నదుల అనుసంధానం జరగాలన్నది నా కోరిక. నదుల అనుసంధానం కోసం మేం ప్రయత్నిస్తున్నాం. వంశధార నుంచి పెన్నా వరకు ఇది జరగాలి. అప్పుడే రాష్ట్రంలో నీటి సమస్య లేకుండా పోతుంది. నల్లమల సాగర్‌తో తెలుగు రాష్ట్రాలకు లాభమే తప్ప నష్టం లేదు. తెలంగాణ వాళ్లు ఈ ప్రాజెక్టుకు అభ్యంతరం చెప్పొద్దు.
- ఏపీ సీఎం చంద్రబాబు

భూభారతి పేరుతో కాంగ్రెస్ మార్క్ అవినీతి

- రెవెన్యూ వ్యవస్థను భ్రష్టుపట్టించిన రేవంత్ రెడ్డి
- సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ కార్యాలయన్నీ ఆకస్మికంగా సందర్శించిన హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 26: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని మాజీ మంత్రి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ఆరోపించారు. “ధరణిని రద్దు చేసి భూభారతి తీసుకొస్తాం” అన్న హామీలు కోటలు దాటుతున్నా, అమలు మాత్రం గడప దాటడం లేదని విమర్శించారు. గురువారం ఆయన సిద్దిపేట అర్బన్ ఎమ్మార్వో కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి, అక్కడ తమ పనుల కోసం వేచి ఉన్న ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో అవ్యవస్థ, అవినీతి పెరిగిపోయిందని ఆరోపించారు.8.68 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లోనే భూభారతి అమల్లో భాగంగా ఏప్రిల్‌లో గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రాష్ట్రవ్యాప్తంగా 8,68,000 దరఖాస్తులు స్వీకరించామని, అయితే పది నెలలు గడిచినా వాటి పరిష్కారంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేకపోతుందని అన్నారు. ఆ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారా లేదా అన్నదానిపై కూడా సమాచారం లేదని విమర్శించారు.సాదా బైనామాపై కొత్త నిబంధనలతో అడ్డంకులు బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో 6,20,000 మంది రైతులకు ఉచితంగా సాదా బైనామా చేసి పాస్‌బుక్కు ఇచ్చామని తెలిపారు. రెండో విడతలో 9,26,000 దరఖాస్తులు వచ్చినప్పటికీ కోర్టు స్టే కారణంగా ఆగిపోయాయని గుర్తు చేశారు.ప్రస్తుతం స్టే ఎత్తివేసినా, భూమి అమ్మిన వ్యక్తి అఫిడవిట్ ఇవ్వాలనే కొత్త నిబంధన పెట్టి సాదా బైనామాను అమలు కాకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఈ నిబంధన వల్ల ఒక్కరికీ పాస్‌బుక్ అందడం లేదని పేర్కొన్నారు.పాస్‌బుక్కు ఆలస్యం, ఫీజులు మాత్రం వసూలు రిజిస్ట్రేషన్ సమయంలో రూ.300 పాస్‌బుక్ ఫీజు వసూలు చేస్తున్నప్పటికీ, ఆరు నెలలు గడిచినా పాస్‌బుక్కు ఇవ్వడం లేదని అన్నారు. గతంలో వారం రోజుల్లో మ్యుటేషన్‌తో పాటు పాస్‌బుక్ నేరుగా రైతు ఇంటికి చేరేదని తెలిపారు. గతంలో 10 శాతం ఉన్న నిషేధిత భూముల పరిమాణం ఇప్పుడు కోటి ఎకరాలకు పెరిగిందని, హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ జాబితాను పబ్లిక్ డొమైన్‌లో పెట్టడం లేదని విమర్శించారు. ప్రజలకు తెలియకుండా భూములను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల అత్యవసర అవసరాల కోసం కూడా అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

ఎల్ఆర్ఎస్, జీవోలు, రీఫండ్లపై విమర్శలు

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎల్ఆర్ఎస్ ఉచితం చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. 58, 59 జీవోలు పెండింగ్‌లో ఉంచి పేదలను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు.రిజిస్ట్రేషన్ స్లాట్ రద్దు చేసుకున్న వారికి డబ్బులు తిరిగి ఇవ్వకుండా రెండున్నరేళ్లుగా తిప్పుకుంటున్నారని, అసెంబ్లీలో హామీ ఇచ్చినా ఇప్పటివరకు చెల్లింపులు చేయలేదని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కాలంలో 20 వేల వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేసి, 61 ఏళ్లు దాటిన వారి వారసులకు ఉద్యోగాలపై జీవో జారీ చేశామని తెలిపారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ జీవో అమలు చేయలేదని విమర్శించారు. చనిపోయిన 600 మంది వీఆర్ఓల కుటుంబాలకు కారుణ్య నియామకాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.రెవెన్యూ శాఖలో కింది స్థాయి అధికారుల నుంచి మంత్రి కార్యాలయం వరకు అవినీతి విస్తరించిందని ఆరోపించారు. మంత్రి కుమారుడే భూకబ్జాలకు పాల్పడుతున్నారని, భూమిని కాపాడిన సీఏని బదిలీ చేయడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు.తక్షణమే ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి శాఖపై సమీక్ష నిర్వహించి పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రజల సమస్యలను ప్రస్తావిస్తామని స్పష్టం చేశారు.

ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్
- అర్ధరాత్రి కమ్యూనిటీ హెల్త్ సెంటర్, వైద్యశాలలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 26 : జిల్లా ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో రాత్రి 12 గంటల సమయంలో రామాయంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు .అర్ధరాత్రి 12 గంటల సమయంలో రామాయణపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను పరిశీలించగా నైట్ డ్యూటీ లో ఉండాల్సిన డాక్టర్లు, నర్సులు పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉన్నారా లేదా అని పరిశీలించారు. రోగులకు అందిస్తున్న ఎమర్జెన్సీ కేసుల వివరాలు, ఆస్పత్రి పనితీరు సుదీర్ఘంగా పరిశీలించారు అనంతరం సుమారు ఒంటిగంట ప్రాంతంలో తూప్రాన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను పరిశీలించి అప్పుడే ప్రమాదవశాత్తు గాయాలతో ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందుతున్న రోగి తో మాట్లాడటం జరిగింది .ఆసుపత్రులలో ఏ విధమైన వైద్య సేవలు అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి విభాగాలను పరిశీలించడం జరిగింది విధులలో ఉండాల్సిన డాక్టర్లు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండటం వల్ల హర్ష వ్యక్త చేశారు.రాత్రి రెండు గంటల సమయంలో నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి చేరుకొని అన్ని విభాగాలు పరిశీలించి, డెలివరీ కేసులను వాకబు చేసి ,ఒక డెలివరీ కేసు సంబంధించి మంచి చికిత్స అందించాలి సిబ్బందికి సూచించారు. అనంతరం కౌడిపల్లి కి పి హెచ్ సి కి చేరుకొని విధుల్లో ఉండాల్సిన సిబ్బంది ఉన్నారా లేరా అని ఆరా తీశారు. అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలో అన్ని వైద్య శాలల్లో డాక్టర్, స్టాఫ్ నర్సులు ,పారామెడికల్ సిబ్బంది, ఇతర వైద్య సిబ్బంది అందరూ విధుల్లో నిమగ్నం అయినందున హర్షం వ్యక్తం చేస్తూ ..జిల్లాలో వైద్య సేవలు గతంలో కంటే చాలా మెరుగైనవని సంతోషం వ్యక్తం చేశారు.రాత్రి వేళల్లో ,సెలవు రోజుల్లో,పండుగ పూట కూడా ఎప్పుడూ ఆకస్మిక తనిఖీ చేసిన కూడా ఆరోజు విధుల్లో ఉండాల్సిన వైద్య సిబ్బంది విధుల్లో ఉండడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇదే స్ఫూర్తి తో ఇంకా మెరుగైన వైద్య అందించాలని వైద్య సిబ్బందిని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా పోలీస్ శాఖకు రెండు పెట్రోల్ బంకులు మంజూరు

- ఎస్పీ డి.వి.శ్రీనివాస రావు

ప్రతిపక్షం,మెదక్ టౌన్,ఫిబ్రవరి 26: మెదక్ జిల్లా పోలీస్ శాఖకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (IOC) కు సంబంధించిన రెండు పెట్రోల్ బంకులు మంజూరయ్యాయని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలోని అవుసులపల్లి వద్ద ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంకుకు ఎస్పీ భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఈ రెండు పెట్రోల్ బంకుల్లో ఒకటి శంకరంపేట (ఆర్) మండల కేంద్రంలో,రెండవది మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ పక్కన (అవుసులపల్లి పరిధిలో) ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.శంకరంపేట (ఆర్) మండల కేంద్రంలో మంజూరైన పెట్రోల్ బంకు నిర్మాణ పనులు ప్రస్తుతం పురోగతిలో ఉందని అన్నారు.ఈ పెట్రోల్ బంకులు పూర్తిగా పోలీస్ శాఖ ఆధీనంలో నిర్వహించబడతాయని, నిర్మాణ పనులు పూర్తైన అనంతరం ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని వెల్లడించారు .ఈ కార్యక్రమంలో మెదక్ అదనపు ఎస్పీ మహేందర్, డియస్పి లు ప్రసన్న కుమార్,రంగా నాథ్,సీఐ లు జర్జ్, రాజశేఖర్ రెడ్డి,సందీప్ రెడ్డి,కృష్ణ మూర్తి,ఆర్ఐ శైలెందర్, రామకృష్ణ, ఎస్సై లు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు పెండింగ్ లో పెట్టొద్దు

- రెవెన్యూ కార్యాలయానికి వచ్చే వారితో మర్యాదగాపూర్వకంగా వ్యవహరించాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 26: అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సిద్దిపేట అర్బన్ తహసిల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. దరఖాస్తులు పెండింగ్లో ఉండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దరఖాస్తుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారికీ గౌరవం ఇవ్వాలన్నారు. వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ తో పాటు అన్ని రకాల దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని వీటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు.

కేసీఆర్ తెచ్చిన కాళేశ్వరం నీళ్లతో రెండు పంటలు

- సిద్దిపేట నుండి ఎన్సాన్ పల్లికి ఫోర్ లైన్ రోడ్డు
- శ్రీ ముత్యాల పోచమ్మ దేవాలయ పునః ప్రతిష్ఠా కార్యక్రమం లో హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 26: సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సన్ పల్లి గ్రామం లో జరుగతున్న శ్రీ ముత్యాల పోచమ్మ దేవాలయ పునః నిర్మాణం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం లో మాజీమంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు ఎన్సాన్ పల్లి గ్రామ చెరువు ఎండాకాలం లో మత్తడి దుంకుతుంది అంటే కెసిఆర్ తెచ్చిన కాళేశ్వరం నీళ్ల తోనే.. కాలం తో పని లేదు కెసిఆర్ తెచ్చిన కాళేశ్వరం నీళ్లతో నేడు రెండు పంటలు పండుతున్నాయన్నారు.నేడు ఎన్సాన్ పల్లి గ్రామం పట్టణ రూపురేఖలు గా మారిందని, వైద్య కళాశాల, వెయ్యి పడకల ఆసుపత్రి, కేంద్రియ విద్యాలయం, సబ్ జైల్ ఇలా అన్ని ఎన్సాన్ పల్లి లోనే ఉన్నాయి. మెడికల్ కళాశాల ఎక్కడ ఉంది అంటే ఎన్సాన్ పల్లి లో అనే అంత అభివృద్ధి చేసుకున్నామని చెప్పరు, గంగమ్మ గుడి, పోచమ్మ గుడి, పెద్దమ్మ గుడి, శివాలయం, కొత్తగా రామాలయం కూడా నిర్మించుకుంటున్నాం, గుడి బడి ఇలా అన్ని చేసుకొని గ్రామాన్ని అభివృద్ధి లో ఆదర్శం గా చేసుకున్నాము సిద్దిపేట నుండి ఫోర్ లైన్ రోడ్డు లైట్స్ తో అద్భుతం గా చేసుకున్నామన్నారు.ఈ సందర్భంగా అమ్మ వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

మెదక్ కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన ప్రతిమాసింగ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 26 : మెదక్ జిల్లాలో గత రెండు సంవత్సరాల క్రితం మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ గా పనిచేసిన ప్రతిమా సింగ్ మళ్ళీ మెదక్ జిల్లా కలెక్టర్ గా బదిలీ పై రావడం పై హర్షం వ్యక్తమవుతోంది . మెదక్ కలెక్టర్ గా పనిచేసిన రాహుల్ రాజ్ స్పెషల్ కమీషనర్ కో ఆపరేటివ్ సహకార రిజిస్ట్రేషన్ శాఖకు బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 45 మంది ఐఎఎస్ అధికారులు బదిలీ చేస్తూ ఛీఫ్ సెక్రెటరీ కె. రాంకిషన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ గా పని చేసిన ప్రతిమాసింగ్ పట్టణ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. జిల్లా కేంద్రంలో అక్రమ నిర్మాణాలకు తావు లేకుండా పనిచేశారు మెదక్ పట్టణ అభివృద్ధికి ముఖ్యంగా పారిశుద్ధ పై ప్రత్యేక దృష్టి పెట్టారు మెదక్ ఖిల్లా అభివృద్ధి కోసం అనేక మార్లు ఖిల్లాపైకి వెళ్ళి ప్రభుత్వ డబ్బు నయాపైసా ఖర్చు కాకుండా ఆనాటి పాలకులు అడ్డుకున్నా, మెదక్ రాచవీడు ఖిల్లా వెలిగేలా తీర్చిదిద్దిన తీరు ఆమెకే దక్కింది. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ ను మెదక్ జిల్లా జర్నలిస్టు సంఘాల నేతలు ఆమెను కలిసి ఘనంగా సన్మానించారు వారిలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ ఐజేయు నాయకులు కంది శ్రీనివాస్ రెడ్డి మెదక్ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు బొందుగుల నాగరాజు నాయకులు రాజశేఖర్.ప్రకాష్. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ 143 జిల్లా కన్వీనర్ సురేందర్ రెడ్డి తోపాటు ఊశయ్య రఘు తదితరులు కలిసి ఆమెను ఘనంగా సన్మానించారు జిల్లాకు వచ్చిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా బ్రహ్మంగారి కళ్యాణ మహోత్సవం

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 26: మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణ మహోత్సవం మంచిర్యాల జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు లోక కళ్యాణ నిమిత్తం వీరబ్రహ్మం గారికి గోవిందమాంబ కళ్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు కళ్యాణ మహోత్సవానికి హాజరయ్యారు. బ్రహ్మం గారి ఆలయ ప్రాంగణంలో హోమము నిర్వహించడం జరిగింది. సాయంత్రం వేళలో బ్రహ్మంగారి పల్లకి సేవ నిర్వహించారు అనంతరం రిత్వికులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కొత్తూరు రాజయ్య శ్రీరామోజు రమేష్ బాబు ఈదుల సత్తయ్య శ్రీరామోజు అనంతరామయ్య మోదింపురం వెంకటేశ్వర్లు లింగంపల్లి విజయ్ కుమార్ ముత్తోజు రమేష్ధర్మవరం బ్రహ్మయ్య ఏ రోజు వేణుగోపాల్ కొక్కొండ రమణయ్య సతీష్ సభ్యతంగా పాల్గొనడం జరిగింది.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ముందు ధర్నా

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 26 : మధ్యాహ్న భోజన కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనం 10000 చెల్లించాలని, పెండింగ్ లో ఉన్న 3 నెలల బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు సిఐటియు ఆధ్వర్యంలో మెదక్ క్యాంప్ ఆఫీస్ ముందు మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు కార్యదర్శి నాగరాజు కు పలు డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మెదక్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి మాట్లాడుతూ... మధ్యాహ్న భోజన కార్మికులకు ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నెలకు 10000/ వేతనం ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. 2 సంవత్సరాలు గడుస్తున్నప్పటికి హామీ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని గుర్తు చేశారు. ఈ బడ్జెట్ సమావేశంలో అయినా మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం 10,000 కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు. గృహ లక్ష్మీ పథకం పేరుతో గ్యాస్ సిలిండర్ 500 కే ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించి అమలుకు శ్రీకారం చుట్టినప్పటికీ, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు అవసరమైన గ్యాస్ ను అన్ని పాఠశాలలకు ఉచితంగా ఇవ్వాలని మండి పడ్డారు. మధ్యాహ్న భోజన కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోడిగుడ్ల బిల్లు, గౌరవ వేతనం, విద్యార్థులకు ఇచ్చే మెనూ చార్జీలు 3 నెలల నుండి పెండింగ్ లో ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి, ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి మధ్యాహ్న భోజన కార్మికులు విద్యార్థులకు వంట చేసి పెడుతున్నారన్నారు. దీంతో మధ్యాహ్న భోజన కార్మికులు అప్పుల పాలవుతున్నారని, తెచ్చిన అప్పులు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తెచ్చిన అప్పులు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పైగా పిల్లలు రాకపోయినా పిల్లలకు వండి పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకపక్క ధరలు ఆకాశాన్ని అంటుతున్న పెరిగిన ధరలు అనుగుణంగా పిల్లలకు ఇచ్చే మెనూ చార్జీలు మాత్రం పెంచడం లేదన్నారు. కార్మికుల జీతాలు పెరగకపోగా, ఉన్న జీతాలు కూడా నెలల తరబడి పెండింగ్ లో ఉంచడం ప్రభుత్వానికి తగదన్నారు. కార్మికులకు ఇచ్చే జీవితమే తక్కువని, అది కూడా రాకపోవడంతో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం కేటాయించిన బడ్జెట్ పాత మెనూకే సరిపోవడం లేదు, ధరలనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలన్నారు. కార్మికులకు వేతనాలు వారి వ్యక్తిగత ఖాతాల్లోని వేయ్యాలన్నారు. వారానికి 3 కోడిగుడ్లు పెట్టాలని, రాగిజావ పోయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. గుడ్డుకు కేటాయించిన బడ్జెట్ 2 గుడ్లకే సరిపోవడం లేదు, 3 గుడ్లు ఎలా పెట్టాలన్నారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలన్నారు. అంగన్‌వాడి సెంటర్లకు సప్లై చేసినట్లుగానే మధ్యాహ్న భోజన పథకానికి కూడా సప్లై చేయాలన్నారు. మధ్యాహ్నం భోజనం కార్మికులకు అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కె. మల్లేశం, మధ్యాహ్న భోజనం కార్మికులు రూప్లీ, జహంగీర్, పద్మ, శ్యామల, నాగరాజ్ గౌడ్, యాదగిరి, నర్సింలు, ఆ లక్ష్మి సుశీల, సుజాత, నవనీత, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యం: సీపీ

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 26: రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించడమే పోలీసుల లక్ష్యమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. మంచిర్యాలలోని ఐ.బి చౌరస్తాలో గురువారం డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేకతనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు సురక్షితంగా ఇంటికి చేరడం లక్షమన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాణం కన్నా విలువైనది ఏది లేదన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. సురక్షిత ప్రయాణం ద్వారా వారి వారి గమ్యాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి భాస్కర్, ఏసిపి ప్రకాష్, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, సిఐ ప్రమోదరావు, ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

“

నా జట్టు టాప్ ఆర్డర్ కుప్పకూలాలని నేను దేవుడిని ప్రార్థిస్తుంటా. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు బ్యాటింగ్‌కు వెళ్తేనే నాకు హీరో అయ్యే అవకాశం వస్తుంది. అలాంటి సవాళ్లను ఎదుర్కోవడం నాకిష్టం. జట్టును ఆదుకునే మ్యాజికల్ ఇన్నింగ్స్ ఆడాలని ఎప్పుడూ కోరుకుంటా.

- టీమ్ ఇండియా యంగ్ బ్యాటర్ జితేశ్ శర్మ

ప్రాంతీయం

రేపటి భవిష్యత్తు రథ సారథులు విద్యార్థులే

- రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రతిపక్షం, దుబ్బాక(అక్బర్ పేట/ భూంపల్లి) ఫిబ్రవరి 26: రేపటి భవిష్యత్ రథ సారథులు విద్యార్థులే అని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గురువారం భూంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో నిర్వహించిన స్వయం పరిపాలన దినోత్సవం వేడుకలకు ఆయన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు చదువు బోధించడం ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు అదృష్టకరంగా భావించాలన్నారు. విద్యార్థులందరూ మంచి విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని అలాగే తల్లిదండ్రులకు,ఉపాధ్యాయులకు గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని కోరారు. ఈ సందర్భంగా తన జీవితంలో పాఠశాల, కళాశాలలో విద్యను అభ్యసించిన జ్ఞాపకాలను విద్యార్థులతో పంచుకోవడం జరిగింది.అనంతరం పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్న గుర్రాల సాయి తేజ అనే విద్యార్థి జిల్లా స్థాయిలోని నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ సాధించగా అతనిని చైర్మన్ వెంకటయ్య శాలువాతో సన్మానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జన్నారెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్,ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు, పాల్గొన్నారు.

సిద్దిపేట బల్దియా బడ్జెట్ రూ.181.99 కోట్లు

- ఏకగ్రీవ ఆమోదం తెలిపిన పాలక వర్గం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 26: సిద్దిపేట పురపాలక సంఘంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.181 కోట్ల 99 లక్షల 50 వేల అంచనా బడ్జెట్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు ప్రవేశపెట్టగా, పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.బడ్జెట్ సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించగా, జిల్లా కలెక్టర్ హైమవతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. జూనియర్ అకౌంటెంట్ ఆఫీసర్ వెంకట్ రావు బడ్జెట్ వివరాలను సభకు వివరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు మాట్లాడుతూ... బడ్జెట్‌కు మద్దతు తెలిపిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు సహకారంతో సిద్దిపేట మున్సిపాలిటీ రాష్ట్రంలో ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ హైమవతి మాట్లాడుతూ... సమగ్ర బడ్జెట్ ప్రవేశపెట్టినందుకు చైర్‌పర్సన్, సభ్యులు, అధికారులను అభినందించారు.మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు ఇందిరమ్మ పథకం గృహాల అంశాన్ని ప్రస్తావించగా, బేస్మెంట్ స్థాయిలో ఉన్న ఇండ్లు పథకానికి అర్హులు కారని కలెక్టర్ స్పష్టం చేశారు. అదనపు ఇండ్ల కోసం ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ మాట్లాడుతూ... సిద్దిపేట అభివృద్ధికి తన వంతు కృషి కొనసాగిస్తానన్నారు. మంచి బడ్జెట్ ప్రవేశపెట్టినందుకు పాలకవర్గ సభ్యులు చైర్‌పర్సన్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

బడ్జెట్ ముఖ్యాంశాలు...

మొత్తం ఆదాయం	రూ.181.99 కోట్లు
మొత్తం వ్యయం	రూ.181.93 కోట్లు
మిగులు	రూ.6.10 లక్షలు
సాధారణ ఆదాయం	రూ.52.96 కోట్లు
సాధారణ వ్యయం	రూ.52.93 కోట్లు

మురికివాడలు, విలీన గ్రామాల మౌలిక వసతుల అభివృద్ధికి రూ.2.73 కోట్లు కేటాయింపు

హరిత బడ్జెట్‌కు 10%గా రూ.5.29 కోట్లు కేటాయింపు

మార్కండేయ దేవాలయంలో
ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 26: సిద్దిపేట పట్టణంలోని మార్కండేయ దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం శ్రద్ధాభక్తులతో ఘనంగా నిర్వహించబడింది. పట్టణ పద్మశాలి సమాజం అధ్యక్షుడు కాముని రాజేశం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉదయం 9 గంటలకు గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం స్వస్తివాచనం, అంకురారోపణం, పంచగవ్య ప్రాశనం, దీక్షాగ్రహణం, అఖండ దీప స్థాపన, ఋత్విగ్వరణం, కలశ స్థాపన, షోడశోపచార పూజ, అగ్ని ప్రతిష్ఠ, ఔపాసన, గణపతి హవనం నిర్వహించారు.సాయంత్రం 4 గంటలకు ఆవాహిత దేవత హవనం, ప్రధాన దేవత హవనం నిర్వహించగా, 5 గంటలకు జలాధివాసం, ఆదివాసాంగ హవనం చేపట్టారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రదోష పూజ, హారతి, మంత్రపుష్పం నిర్వహించి తీర్థ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు.ఈ మహోత్సవంలో బ్రహ్మశ్రీ దూసకంటి సత్యనారాయణ శర్మ, బ్రహ్మశ్రీ ఆదరాసుపల్లి శివరామకృష్ణ శర్మ, సద్గురు సదానంద సకినాల కృష్ణమూర్తి, మలిపెద్ది నాగేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యక్షులు పెద్ది అశోక్, ఇప్పకాల శ్రీహరి, ప్రధాన కార్యదర్శి సిరిగాది బాల్‌రాజు, సహాయ కార్యదర్శులు గుండు రవితేజ (లడ్డు), చిలుక ఆంజనేయులు, కోశాధికారి సూరం ప్రసాద్, కార్యవర్గ సభ్యులు,యువజన, మహిళా సంఘాల ప్రతినిధులు, 43 వార్డుల ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.భక్తుల భారీ పాల్గొనికతో ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు
ప్రజలకు చేరాలి

- మెదక్ నూతన కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 26 : ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం నూతన కలెక్టర్ కలెక్టరేట్ కు చేరుకోగానే జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, డి ఆర్ ఓ భుజంగ రావు,మెదక్ ఆర్డీవో రమాదేవి పూలమొక్క అందించి స్వాగతం పలికారు. జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యత చేపట్టిన కలెక్టర్ కు జిల్లా అధికారులు జిల్లా అధికారులు పూల మొక్కల తో స్వాగతం పలికి మర్యాదగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా నూతన కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను నెరవేర్చుతూ ,ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తానన్నారు. ఇంటర్, పదో తరగతి పరీక్షల గురించి డీఈఓ ను, ఇంటర్ విద్యార్థి గారిని అడిగి తెలుసుకున్నారు. ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ ఓ భుజంగరావు, జిల్లా అధికారులందరూ పాల్గొన్నారు.

యూరియా కొరతతో
రైతులను ఇబ్బంది పెడుతున్న రేవంత్ ప్రభుత్వం

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 26: చిన్న కోడూరు మండల కేంద్రంలో యూరియా కొరతపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ మాట్లాడుతూ...రాష్ట్రంలో రైతులకు సకాలంలో యూరియా అందడం లేదని ఆరోపించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. యాప్ విధానం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చాలా మందికి స్మార్ట్‌ఫోన్లు లేకపోవడం, ఓటీపీ సమస్యలు తలెత్తడం వల్ల యూరియా బుకింగ్ సక్రమంగా జరగడం లేదని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో నాట్ల సీజన్‌లో యూరియా, రైతుబంధు సకాలంలో అందించేవారని, ప్రస్తుతం రైతు భరోసా పేరుతో హామీలు ఇస్తున్నా అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఇటీవల మంత్రుల సమావేశంలో రైతు భరోసా నిధులపై నిర్ణయం తీసుకున్నప్పటికీ, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని ఆయన పేర్కొన్నారు. యాప్ విధానాన్ని రద్దు చేసి, గ్రామ స్థాయిలోనే సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య, రాష్ట్ర నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, సర్పంచ్ నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి మూల్యాంకల కేంద్రం ఏర్పాటు పట్ల హర్షం

ప్రతిపక్షం,మెదక్ టౌన్,ఫిబ్రవరి 26: మెదక్ జిల్లా ఉపాధ్యాయుల చాలా సంవత్సరాల నుండి ఉన్న కోరిక పదవ తరగతి మూల్యాంకన కేంద్రం ఈ సంవత్సరం మెదక్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడం పట్ల పిఆర్టియు హవేలీ ఘనపూర్ మండల శాఖ హర్ష వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలో పిఆర్టియు రాష్ట్ర శాఖ అసోసియేట్ అధ్యక్షులు ఎల్ మల్లారెడ్డి మాట్లాడుతూ... ఇంతవరకు మెదక్ జిల్లా నుండి ఉపాధ్యాయులు స్పాట్ వాల్యుయేషన్ గురించి బిహెచ్ఇఎల్ జ్యోతి విద్యాలయంకు వెళ్లేవారని ఈ సంవత్సరం నుండి స్పాట్ వాల్యుయేషన్ మెదక్ లో ఏర్పాటు చేయడం పట్ల ఉపాధ్యాయులకు ఆ బాధ తప్పిందని అన్నారు.మూల్యాంకన కేంద్రానికి కృషి చేసిన ఎమ్మెల్యే మైనం పల్లి రోహిత్ రావు,మెదక్ కలెక్టర్,జిల్లా విద్యాధికారి విజయ విద్యాశాఖ అధికారులకు, పిఆర్టియు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన , ప్రధాన కార్యదర్శులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, పిఆర్టియు మెదక్ జిల్లా శాఖకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో మండల జిల్లా బాధ్యులు త్యార్ల శ్రీనివాస్ , రాజేందర్ రెడ్డి,శశి కుమార్ సుభాష్,నరేందర్ రెడ్డి లు ఉన్నారు.

జక్కాపూర్ విద్యార్థికి స్టేట్ సెకండ్ ర్యాంక్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 26: ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ నిర్వహించిన రాష్ట్రస్థాయి భౌతిక రసాయన శాస్త్ర ప్రతిభా పరీక్షలో పీఎం శ్రీ జడ్పిహెచ్ఎస్ జక్కాపూర్ 9వ తరగతి విద్యార్థి ఎం అశ్విత్ రెడ్డి అత్యున్నత ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. 33 జిల్లాల నుంచి దాదాపు 100 మంది పాల్గొన్న ఈ ప్రతిభా పరీక్షలో అశ్విత్ రెడ్డి 50 మార్కుల గాను 35 మార్కులు సాధించి ద్వితీయ స్థానాన్నికైవసం చేసుకున్నాడు. ఎస్ సి ఈ ఆర్ టి డైరెక్టర్ రమేష్ చేతుల మీదుగా రెండువేల రూపాయల నగదు పురస్కారము 2000 రూపాయల విలువగల సైన్స్ కిట్ ను బహుమానంగా అందుకున్నాడు. 2025 లో ఎన్.ఎం.ఎం.ఎస్ జిల్లా మొదటి ర్యాంకు సాధించిన అశ్విత్ రెడ్డి ఈ సంవత్సరం ఫిజికల్ సైన్స్ రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కొమ్మూరి పద్మ ఉపాధ్యాయ బృందం పాఠశాల శ్రేయోభిలాషులు విద్యార్థిని గైడ్ టీచర్ ను అభినందించారు.

బిర్యానీ, సాంబారు నాణ్యతను మెరుగుపరచాలి

- విద్యార్థులకు రుచికరంగా వండాలి
- కలెక్టర్ కె హైమావతి ఆకస్మిక తనిఖీలు
- మధ్యాహ్న భోజన నాణ్యతపై ఆదేశాలు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 26: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బిర్యానీ అన్నం, క్యాబేజీ, ఆలుగడ్డ, టమాటా కూర, సాంబారు వంటి వంటకాలను పరిశీలించారు. బిర్యానీ, సాంబారు నాణ్యతను మెరుగుపరచాలని, విద్యార్థులకు రుచికరంగా వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. కామన్ డైట్ మెనూను కచ్చితంగా పాటిస్తూ విద్యార్థుల హాజరు ప్రకారం సరుకులు సిద్ధం చేసి అందరికీ సరిపడా భోజనం అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. స్టోర్‌రూమ్‌లోని సరుకులను భద్రంగా నిల్వ ఉంచాలని చెప్పారు. డైనింగ్ హాల్, వంటగది పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని గుర్తించి, ఫర్నిచర్ శుభ్రపరచి విద్యార్థులు సౌకర్యంగా కూర్చునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడ్ గ్రామంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. బిర్యానీలో మసాలా, బిర్యానీ ఆకు సరిగా లేకపోవడం, సాంబారు నాణ్యత తక్కువగా ఉండటంపై వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంటలు నాణ్యతగా, రుచికరంగా ఉండాలని హెచ్చరించారు. భోజన ప్రక్రియను ఫుడ్ చెకింగ్ టీచర్ నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.తరువాత ప్రాంగణంలోని ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాన్ని సందర్శించి అన్నం, గుడ్డు, పాలకూర పప్పు, బెండకాయ ఫ్రై, సాంబారు, పెరుగు వంటి వంటకాలను పరిశీలించారు. పాలకూర పప్పు పలుచగా ఉందని మెరుగుపరచాలని సూచించారు. విద్యార్థులతో భోజనం గురించి మాట్లాడి కడుపునిండా తినాలని ప్రోత్సహించారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు ఇంజనీరింగ్ అధికారులను పంపిస్తానని హామీ ఇచ్చారు.

మోదీ ఇజ్రాయెల్ పర్యటన ముగిసిన వెంటనే ఇరాన్‌పై అమెరికా దాడి చేసే అవకాశం ఉంది. మరోవైపు గాజా మారణహోమానికి నెతన్యాహునే కారణం. ఆయన 'యుద్ధ నేరస్థుడు'. అలాంటి వ్యక్తిని మోదీ కౌగిలించుకోవడమేంటి. ఇది పాలస్తీనాకు భారత్ అందించే చిరకాల మద్దతును దెబ్బతీయడమే.

- ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

అరకొర సీపీఎస్ పెన్షన్‌తో
వృద్ధాప్యంలో వైద్య ఖర్చులు ఎలా భరించాలి?

- రిటైర్మెంట్ తర్వాత ఉచిత ఆరోగ్య భీమా కల్పిస్తేనే ఈ హెచ్ ఎస్ కు 1.5% చందా..!!

ప్రతిపక్షం, దుబ్బాక, ఫిబ్రవరి 26: ప్రస్తుతం సి పిఎస్ విధానంలో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులను ఈ.హెచ్. ఎస్ లో కొనసాగించుటకు గాను, బేసిక్ పే నుండి 1.5% చందాను మినహాయించాలని భావిస్తున్న ప్రభుత్వ నిర్ణయంపై సిపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోందని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కురాకుల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానం వల్ల రిటైర్మెంట్ తర్వాత వచ్చే నామమాత్రపు పెన్షన్‌తో వృద్ధాప్యంలో పూటగడవడమే కష్టంగా మారిందని , ఇలాంటి దుస్థితిలో రిటైర్మెంట్ తర్వాత ఎలాంటి ఉచిత ఆరోగ్య భద్రత కల్పించకుండా ఇప్పుడు మా జీతాల నుండి 1.5% చందా వసూలు చేయడం దారుణమని, ఇప్పటికే సిపీఎస్ విధానం కోసం 10% బేసిక్+ డి.ఏ లో కోత విధిస్తున్నారని వాపోయారు. వృద్ధాప్యంలో వచ్చే అనారోగ్య సమస్యలకు ఈ అరకొర పెన్షన్‌తో లక్షల రూపాయల వైద్య ఖర్చులు ఎలా భరించాలని ఆయన ప్రశ్నించారు. ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందిన తర్వాత కూడా ఉద్యోగులకు ఉచిత ఆరోగ్య భీమా సదుపాయం కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇస్తేనే , బేసిక్ పే నుండి 1.5% మొత్తాన్ని కట్ చేయడానికి రాష్ట్రంలోని 2.6 లక్షల సిపీఎస్ ఉద్యోగులు సమ్మతి తెలుపుతారన్నారు. ఈ పథకం కోసం ప్రభుత్వం తన వంతుగా చెల్లించే 1.5% కంట్రిబ్యూషన్ మొత్తాన్ని సిపీఎస్ ఉద్యోగులకు రిటైర్మెంట్ అయ్యాక 'హెల్త్ అల్లోవన్స్' గా జమ చేసి (ఈ హెచ్ ఎస్) ద్వారా ఉచిత ఆరోగ్య భద్రత సౌకర్యం కల్పిస్తే సిపీఎస్ పెన్షనర్లు లకు తమ ఆరోగ్య భద్రత కల్పించినట్లు అవుతుందన్నారు. ప్రభుత్వం చర్చలు జరిపే జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సంఘాల్లో ఒక్కరు కూడా సిపీఎస్ సంఘం నుండి ప్రతినిధి లేక పోవడం సిపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయుల ఇబ్బందులు ప్రభుత్వానికి తెలియడం లేదని ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు అనుగుణంగా తగిన ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జిల్లా సమాగ్రాభివృద్ధికి కృషి చేసిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 26 : పేద ప్రజలకు విద్య, వైద్యం,సంక్షేమ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెడుతూనే..అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా, పకడ్బందిగా సమర్థవంతమైన పాలనను అందించి తనదైన ముద్ర వేసుకున్నారు. మెదక్ జిల్లా కలెక్టర్ గా రాహుల్ రాజ్ ఆన్ డ్యూటీ 24x7 చేశారు గురువారం సైతం అర్ధరాత్రి వరకు వివిధ ప్రాథమిక హాస్పటలను సందర్శించి వారి పని విధానాన్ని పర్యవేక్షించారు 2025 సం:లో సుమారుగా 300 రోజులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేశారు. జిల్లా ప్రజలందరికీ విద్య వైద్యం అందేలా కృషి చేశారు జిల్లాలో కీలక మార్పులు తీసుకురావడంలో కలెక్టర్ ప్రముఖ పాత్ర పోషించారు. విద్యలో(ఎస్ఎస్సి) ఫలితాల్లో లో 93 నుంచి 97 శాతం ఉత్తీర్ణత పెంచారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే టీచర్లను ప్రోత్సహించారు. జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది సమయ పాలన పాటిస్తూ విధులు నిర్వర్తించేలా చర్యలు చేపట్టారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ 2024లో 350 మరణాలు నమోదు అయితే 2025లో వాటిని 287కు తగ్గించడం అన్ని సమీక్షలు నిర్వహించి ప్రమాదాల నివారణకు కృషి చేశారు.ఈ ఆఫీసు, ప్లాస్టిక్ నిషేధం,పేపర్ లెస్ లాంటి వినూత్న కార్యక్రమాల అమలకు శ్రీకారం చుట్టారు. భూ భారతి దరఖాస్తులను పెద్ద ఎత్తున పరిష్కరించారు. దాదాపు 10,000 దరఖాస్తులను శాశ్వతంగా పరిష్కరించారు. వివిధ ఫైల్స్ ను ఈ ఆఫీసులో 2,500 పెండింగ్ ఫైలును పరిష్కరించారు. విద్యా శాఖలో. లో గ్రౌండ్ బేస్డ్ లెర్నింగ్ విధానాన్ని పటిష్టంగా అమలు చేశారు. విద్యార్థుల్లో సైన్సు గణిత సామర్థ్యాలను పెంపొందించి వారిలోని సృజనత్మాకత ను వెలికి తీసిన గురువు జిల్లా కలెక్టర్ రాత్రి పగలు లేవు..సెలవు రోజు లేవు, పండుగ రోజులు లేవు ప్రతి రోజు పాఠశాలకు వెళ్ళాలనే సంకల్పంతో విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి పాఠాలు బోధించి వారి సందేహాలను నివృత్తి చేసిన కలేక్టర్ గా పేరుతెచ్చుకున్నారు.

ఎప్‌స్టీన్ ఫైల్స్ ఒత్తిడి వల్లే.. వాణిజ్య ఒప్పందం

- దీంతో భారత రైతులు బలి అవుతున్నారు.. ● తీవ్ర ఆరోపణలు చేసిన రాహుల్ గాంధీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: భారత్‌అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని బెదిరించడానికి ఎప్‌స్టీన్ ఫైళ్లను అమెరికా అధ్యక్షుడు ఉపయోగించారని ఆరోపించారు. ఈ ఒప్పంద వల్ల భారత రైతులు బలి అవుతున్నారని ఆరోపించారు. గురువారం కేరళ కన్నూర్ జిల్లాలోని పెరవూరులో రైతుల మహాసభను నిర్వహించారు. ఈ సభలో మాట్లాడుతూ కేంద్రంపై ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'రైతులే దేశానికి పునాది. ఈ సాధారణ వాస్తవాన్ని కేంద్రం అర్థం చేసుకోవడం లేదు. ఐటీ వంటి ఇతర రంగాలపై సుదీర్ఘ ఉపన్యాసాలు ఇస్తున్నారు. కానీ పునాది బలోపేతం చేయకుండా ఏం నిర్మించలేం. పునాదిని గౌరవించకపోతే ఏదీ నిలబడదు. పునాది వేసే వ్యక్తికి గౌరవం, రక్షణ ఉండాలి. మనం రోజూ ఆహారం తింటాం కానీ అది మన ముందుకు తీసుకొచ్చే రైతును గుర్తు చేసుకోము. ఇక అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం ఆ పునాది తవ్వినట్టే ఉంది. తక్కువ స్థాయిలో యాంత్రీకరణ కలిగిన చిన్న స్థాయి రైతులు మనవాళ్లు. అమెరికా రైతులకు విస్తారమైన భూములు, అధిక యాంత్రీకరణ ఉంది. ఇలాంటి పరిస్థితిలో అమెరికా కంపెనీలకు భారత మార్కెట్లను తెరవడం నేరపూరిత చర్య అవుతుంది' అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

విశ్వ వీక్షణం

ఎన్సీఈఆర్టీ వివాదం..
బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటాం

- కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్య పుస్తకంలో 'న్యాయవ్యవస్థలోని అవినీతి' గురించి ఒక అధ్యాయం చేర్చడంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ వివాదాస్పద అంశాన్ని పిల్లల పాఠ్యాంశంగా రూపొందించిన వారిని బాధ్యులుగా చేస్తామని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గురువారం పేర్కొన్నారు. ప్రభుత్వానికి న్యాయవ్యవస్థపై పూర్తి గౌరవం ఉందని, ఆ వ్యవస్థను అగౌరవపరిచే ఉద్దేశం ఏమాత్రం లేదని ఆయన స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థను అప్రతిష్ఠపాలు చేసే ఒక సంఘటిత కుట్ర జరిగినట్లు కనిపిస్తోందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ఈ కీలక ప్రకటన చేయడం గమనార్హం. మరోవైపు బీజేపీ కూడా ఈ అంశంపై స్పందించింది. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతి గురించి ఉన్న వివాదాస్పద అధ్యయాన్ని 'సున్నితమైన అంశంగా' అభివర్ణించింది. తాము దేశ న్యాయవ్యవస్థను గౌరవిస్తామని, దాని నిష్పాక్షిక పనితీరు పట్ల గర్విస్తున్నామని పేర్కొంది. బుధవారం సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నప్పుడు, ప్రభుత్వం న్యాయవ్యవస్థకు అండగా ఉంటుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారని సంబిత్ పాత్ర గుర్తుచేశారు. వివాదాస్పద ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి సామాజిక శాస్త్ర పుస్తకంలో అవినీతి, భారీగా పేరుకుపోయిన కేసులు, సరిపడా సంఖ్యలో న్యాయమూర్తులు లేకపోవడం వంటివి న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లుగా పేర్కొన్నారు. అంతేకాదు న్యాయవ్యవస్థలో అవినీతి అనే సబ్‌చాప్టర్‌ను చేర్చారు. ఇదే తీవ్ర వివాదానికి దారి తీసింది. అందుకే ఈ పాఠ్యపుస్తకంపై సుప్రీంకోర్టు పూర్తిస్థాయి నిషేధం విధించింది. అంతేకాదు ఫిజికల్, డిజిటల్ రూపంలో ఉన్న అన్ని కాపీలను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది.



విరోష్ వేదికగా ఒక్కటైన విజయ్, రష్మిక

విజయ్ దేవరకొండ, రష్మిక మంధాన వివాహం ఉదయ్‌పూర్‌లో ఘనంగా జరిగింది. హిందూ సంప్రదాయం ప్రకారం ఉదయం 10 గంటల 10 నిమిషాలకు రష్మిక, విజయ్‌ల వివాహం గురువారం వైభవంగా జరిగింది. గురువారం సాయంత్రం టాలివుడ్ ప్రేమ జంట తమ పెళ్లి ఫోటోలను సోషలక మీడియా ద్వారా పంచుకున్నారు. 'ఓ రోజు, నేను ఆమెని మిస్ అయ్యాను. ఆమె నాతో ఉంటే ఆ రోజు మరింత బాగుండేదని అనిపించేది. ఆమెతో కలిసి తింటే, ఆ భోజనం మరింత కమ్మగా ఉండేదని అనిపించింది. ఆమెతో కలిసి చేసే వర్కవుట్స్ మరింత ఫన్నీగా, చాలా తక్కువ నొప్పిగా అనిపించాయి. ఆమెతో ఉంటే చాలు, ఎక్కడ ఉన్నా ఇంట్లో ఉన్నట్టుగా, ప్రశాంతంగా ఉన్నట్టుగా అనిపించింది. కాబట్టి నా బెస్ట్ ఫ్రెండ్‌నే నేను భార్యగా చేసుకున్నా..' అంటూ విజయ్ దేవరకొండ పెళ్లి ఫోటోలను షేర్ చేశాడు.





డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు బాధ్యతల నుండి తప్పించుకోలేరు

- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: డిజిటల్ ప్రపంచంలో ప్లాట్‌ఫామ్‌లు ఇకపై బాధ్యత నుంచి తప్పించుకోలేవని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. తాము ప్రదర్శించే లేదా ప్రచురించే ప్రతి కంటెంట్‌కు పూర్తి బాధ్యత వహించాల్సిందేనని ఆయన కఠిన హెచ్చరిక చేశారు. ఆన్‌లైన్‌లో చిన్నారులు, సాధారణ పౌరుల భద్రతను కాపాడటం వారి ప్రాథమిక కర్తవ్యమని తెలిపారు. డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడిన కేంద్ర మంత్రి, వేల ఏళ్లుగా మనుషుల సమాజం నిర్మించుకున్న విశ్వాస వ్యవస్థలను డిజిటల్ వేదికలు దెబ్బతీయకూడదని సూచించారు. కుటుంబం నుంచి న్యాయవ్యవస్థ, మీడియా, శాసనసభ వరకు ప్రతి వ్యవస్థ నమ్మకంపై ఆధారపడి పనిచేస్తుందని గుర్తుచేశారు. అదే నమ్మకాన్ని డిజిటల్ ప్రపంచం కూడా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ఇప్పటివరకు తాము కేవలం వేదిక మాత్రమేనని చెప్పే రోజులు ముగిశాయని ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచానికి ఆతిథ్య వేదికలుగా మారిన ఈ ప్లాట్‌ఫామ్‌లు తమ వద్ద ప్రసారం అయ్యే సమాచారంపై బాధ్యత వహించాల్సిందేనని చెప్పారు. ఒక హోటల్ యజమాని తన హోటల్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూసుకునే బాధ్యత తీసుకున్నట్లే, డిజిటల్ వేదికలు కూడా తమ వద్ద హోస్ట్ అయ్యే కంటెంట్ చట్టబద్ధమా కాదా అన్నది పరిశీలించాలన్నారు. అల్గారిథమ్‌ల ద్వారా వ్యాప్తి చెందే సమాచారం మోసపూరితమైందా? పౌరులకు హాని కలిగిస్తుందా? చిన్నారులపై ప్రభావం ఉంటుందా? నేరాలకు దోహదపడుతుందా? వంటి ప్రశ్నలకు ప్లాట్‌ఫామ్‌లే సమాధానం చెప్పాలని స్పష్టం చేశారు. బాధ్యతను విస్మరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఐ ఆధారిత కంటెంట్‌పై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వేరొకరి ముఖం, గొంతు, వ్యక్తిత్వాన్ని అనుమతి లేకుండా ఉపయోగించి కంటెంట్ సృష్టించడం అనైతికమని, దానికి నియంత్రణ అవసరమని పేర్కొన్నారు. డీప్‌ఫేక్‌ల ద్వారా లేనిది ఉన్నట్లు చూపించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రమాదం ఉందని అన్నారు. ఇలాంటి సాంకేతికతలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని చెప్పారు.

48గంటల ముందు టికెట్లు రద్దుకు చార్జీలుండవు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: విమాన ప్రయాణికులకు డీజీసీఏ శుభవార్త చెప్పింది. టికెట్ రద్దు, రిఫండ్‌లకు సంబంధించి సివిల్ ఏవియేషన్ రిక్వైర్‌మెంట్స్‌ను సవరిస్తూ కీలక మార్గదర్శకాలు జారీచేసింది. ఈ మార్గదర్శకాల ప్రకారం.. ప్రయాణికులు టికెట్ బుక్ చేసిన 48 గంటల లోపు ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండానే టికెట్‌ను రద్దు చేసుకోవచ్చు లేదా మార్పులు చేసుకోవచ్చు. ఈ కొత్త నిబంధనలు మార్చి 26 నుంచి అమల్లోకి రానున్నాయి. కానీ ఈ 'లుక్ఇన్' పీరియడ్ సదుపాయానికి కొన్ని షరతులు వర్తిస్తాయి. దేశీయ విమాన ప్రయాణానికి కనీసం 7 రోజుల ముందు, అంతర్జాతీయ ప్రయాణానికి 15 రోజుల ముందు బుక్ చేసుకున్న టికెట్లకు మాత్రమే ఈ నిబంధన వర్తిస్తుంది. కేవలం ఎయిర్‌లైన్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా నేరుగా టికెట్లు బుక్ చేసుకున్న వారికే ఈ ప్రయోజనం అందుబాటులో ఉంటుంది. ఒకవేళ వేరే విమానానికి టికెట్ మార్చుకుంటే ఛార్జీల వ్యత్యాసాన్ని ప్రయాణికులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే 48 గంటలు దాటిన తర్వాత సాధారణ రద్దు ఛార్జీలు వర్తిస్తాయని డీజీసీఏ స్పష్టంచేసింది. టికెట్లపై పేరు తప్పుగా పడితే బుక్ చేసిన 24 గంటల్లోపు తెలియజేస్తే ఎలాంటి రుసుము లేకుండా సరిచేసుకోవచ్చని తెలిపింది. ఇక రిఫండ్ల విషయంలోనూ డీజీసీఏ స్పష్టత ఇచ్చింది. ట్రావెల్ ఏజెంట్ల ద్వారా బుక్ చేసుకున్న టికెట్ల రిఫండ్ బాధ్యత కూడా విమానయాన సంస్థలదేనని, 14 రోజుల్లోగా ఆ మొత్తాన్ని వాపసు ఇవ్వాలని ఆదేశించింది. క్రెడిట్ కార్డ్ చెల్లింపుల రిఫండ్‌ను 7 రోజుల్లో, ఆఫీసులో నగదు చెల్లింపులను తక్షణమే పూర్తి చేయాలని డీజీసీఏ పేర్కొన్నది. బేస్ ఫేర్ నాన్‌రిఫండబుల్ అయినప్పటికీ.. పన్నులు, ఇతర ఛార్జీలను తప్పనిసరిగా వాపసు ఇవ్వాలని చెప్పింది.



శభాష్,.. సంజూ

టీమిండియా ఓపెనర్ సంజూ శాంసన్‌పై నెటిజన్లు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. థ్యాంక్యూ సంజూ అంటూ ఎక్స్ వేదికగా పోస్టులు పెడుతున్నారు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా చెన్నై వేదికగా జింబాబ్వేతో జరుగుతున్న మ్యాచ్‌లో సంజూ శాంసన్ అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. 15 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 24 పరుగులే చేసినా.. గత ఐదు మ్యాచ్‌ల్లో టీమిండియాకు దక్కని ఆరంభాన్ని అందించాడు. ముఖ్యంగా డకౌట్ల బాధ నుంచి టీమిండియాను గట్టెక్కించాడు. ఈ మ్యాచ్ కు ముందు జరిగిన ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు సార్లు ఓపెనర్లు డకౌటయ్యారు. ఇందులో అభిషేక్ శర్మ మూడు సార్లు డకౌటైతే.. సౌతాఫ్రికాతో మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ సున్నాకే వెనుదిరిగాడు. తాజా మ్యాచ్‌లో సంజూ శాంసన్ బాధ్యత తీసుకోని ధాటిగా ఆడటంతో అభిషేక్ శర్మ క్రీజులో సెట్ అయ్యేందుకు కాస్త సమయం లభించింది. ఆ తర్వాత అతను కూడా చెలరేగడంతో తొలి వికెట్‌కు 3.4 ఓవర్లలోనే 48 పరుగుల భాగస్వామ్యం లభించింది. ఈ మెగా టోర్నీలో సంజూకు ఇది రెండో మ్యాచ్ మాత్రమే. నమీబియాతో మ్యాచ్‌లోనూ ఇదే తరహాలో ఆడిన సంజూ.. తాజా మ్యాచ్‌లోనూ తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాడు. ఈ టోర్నీలో ప్రత్యర్థి జట్లు తెలివిగా.. పవర్ ప్లేలో ఎడమచేతి వాటం బ్యాటర్లు అయిన ఇషాన్, అభిషేక్, తిలక్‌లకు ఆఫ్ స్పిన్నర్లతో బౌలింగ్ చేయించడం ద్వారా పరుగులు చేయకుండా కట్టడి చేసింది. దాంతో కుడిచేతి వాటం బ్యాటరైన శాంసన్‌ను ఆడించడం ద్వారా ఈ సమస్య అధిగమించవచ్చని టీమిండియా మేనేజ్‌మెంట్ భావించింది. అందులో భాగంగానే రింకూ సింగ్‌ను తప్పించి సంజూను ఓపెనర్‌గా ఆడించింది. మేనేజ్‌మెంట్ పెట్టుకున్న నమ్మకాన్ని సంజూ నిలబెట్టుకున్నాడు.

చితక్కొట్టిన పాండ్యా, అభిషేక్

- జింబాబ్వేపై భారీ విజయం.. సెమీస్ రేసులో భారత్

చావోరేవో పోరులో భారత జట్టు ఘన విజయం సాధించింది. టాప్ ఆర్డర్ చెలరేగి రికార్డు స్కోరును నమోదు చేయగా జింబాబ్వేపై టీమిండియా 72 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. రికార్డు ఛేదనకు దిగిన ప్రత్యర్థిని వందలోపే ఆలౌట్ చేస్తుందనుకుంటే.. కనీసం వంద పరుగుల తేడాతో అయినా గెలవలేదు. అయితే.. తొలిపోరులో దక్షిణాఫ్రికా చేతితో కంగుతిన్న టీమిండియా ఈ విజయంతో సెమీస్ ఆశలు సజీవంగా ఉంచుకుంది. గ్రూప్ ఏ నుంచి సఫారీ జట్టు సెమీస్‌కు అర్హత సాధించింది. లీగ్ దశను అజేయంగా ముగించి.. సూపర్ 8ను ఓటమితో ఆరంభించిన భారత్.. కీలకమ్యాచ్‌లో జింబాబ్వేను చిత్తు చేసింది. అహ్మదాబాద్‌లో దక్షిణాఫ్రికా చేతిలో 76 పరుగుల తేడాతో ఓడిన టీమిండియా.. చెపాక్‌లో ఆఫ్రికా జట్టుపై 72 పరుగుల తేడాతో గెలుపొందింది. అయితే.. వెస్టిండీస్‌పై 9 వికెట్లతో జయభేరి మోగించిన సఫారీ టీమ్.. గ్రూప్ ఏ నుంచి దర్జాగా సెమీస్‌లో అడుగుపెట్టింది. ఈ పరిస్థితుల్లో చివరి నాకౌట్ పోరు భారత్, కరీబియన్ జట్టుకు కీలకం కానుంది. గెలిచిన జట్టు ముందంజ వేస్తుంది. ఒకవేళ మ్యాచ్ రద్దైతే.. మెరుగైన రన్‌రేటున్న విండీస్ సెమీస్ బెర్తు పట్టేస్తుంది. రికార్డు ఛేదనలో జింబాబ్వే ఇన్నింగ్స్‌ను ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్(97 నాటౌట్), మరుమని(20)లు దూకుడగా ఆరంభించారు. పవర్ ప్లేలో వీరిద్దరూ స్కోర్ 40 దాటించారు. అయితే.. అక్షర్ పటేల్ ఓవర్లో మరుమని షాట్ ఆడి ఇషాన్ చేతికి చిక్కాడు. కాసేపటికే డియన్ మైయర్స్(6)ను వరుణ్ చక్రవర్తి వెనక్కి పంపాడు. అనంతరం కెప్టెన్ సికిందర్ రజా(31) జతగా బెన్నెట్ పెద్ద షాట్లు ఆడాడు. వీరిద్దరూ సిక్సర్లతో అలరిస్తూ అర్ధ శతకం భాగస్వామ్యం నెలకొల్పారు. రజాను అర్ష్‌దీప్ ఔట్ చేయగా.. మున్యోగా(11), ముసెకివా(7)లు త్వరగానే పెవిలియన్ చేరారు. ఓవైపు వికెట్లు పడుతున్నా బెన్నెట్ మాత్రం తగ్గేదేలే అన్నట్టు చెలరేగి సెంచరీకి చేరువయ్యాడు. కానీ.. ఓవర్లో సిక్స్, ఫోర్ రావడంతో జింబాబ్వే 184కే పరిమితమైంది. సెమీస్ ఆశలు నిలవాలంటే గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో భారత క్రికెటర్లు శివాలెత్తిపోయారు. ఓపెనర్ అభిషేక్ శర్మ(55) ఫామ్ చాటుకుంటూ అర్ధశతకంతో రెచ్చిపోగా.. వచ్చినవాళ్లు వచ్చినట్టు వీరంగం సృష్టించారు. జింబాబ్వే బౌలర్లను హడలెత్తిస్తూ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(33), తిలక్ వర్మ(44 నాటౌట్)లు కసిదీరా కొట్టగా.. హార్దిక్ పాండ్యా(50 నాటౌట్) తన స్టయిల్ విధ్వంసంతో ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. టాపార్డర్ సహా మిడిల్ మెరుపులతో టీమిండియా పొట్టి ప్రపంచకప్‌లో 256తో వ్యక్తిగత రికార్డు(గతంలో 220 రన్స్)ను బ్రేక్ చేసింది.

వెస్టిండీస్ పై సౌతాఫ్రికా ఘన విజయం

టీ 20 ప్రపంచకప్ వేటలో దక్షిణాఫ్రికా దూసుకెళ్తోంది. సూపర్ 8 తొలిపోరులో భారత జట్టును 76 పరుగులతో చిత్తుచేసిన సఫారీ టీమ్.. పటిష్టమైన వెస్టిండీస్‌ను అలవోకగా మట్టికరిపించింది. అదిరే ఆటతో ప్రత్యర్థిని కట్టడి చేసిన ప్రొటీస్ జట్టు.. 177 పరుగుల లక్ష్యాన్ని ఉఫ్‌మనిపించింది. ఓపెనర్ ఎడెన్ మర్క్‌రమ్(82 నాటౌట్), క్వింటన్ డికాక్(47) మంచుముక్కలా కరిగించారు. డికాక్ ఔటయ్యాక.. రియాన్ రికెల్టన్(45 నాటౌట్) జతగా ప్రొటీస్ కెప్టెన్ లాంఛనం ముగించాడు. వరుసగా రెండు విజయాలతో మర్క్‌రమ్ సేన గ్రూప్ ఏలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. గతసీజన్ ఫైనలిస్ట్ దక్షిణాఫ్రికా పదోసీజన్‌లో రెచ్చిపోతోంది. లీగ్ దశను అజేయంగా ముగించిన ఆ జట్టు సూపర్ 8లోనూ పంజా విసురుతోంది. గురువారం వెస్టిండీస్ నిర్దేశించిన 177 పరుగుల భారీ ఛేదనను ఓపెనర్లు ఎడెన్ మర్క్‌రమ్(82 నాటౌట్), క్వింటన్ డికాక్(47), దూకుడుగా ఆరంభించారు. తొలి ఓవర్లోనే 6, 4తో రన్స్ పిండుకున్నారు. ఆ తర్వాత కూడా విధ్వంసక ఆటతో రెచ్చిపోయిన ఈ ద్వయం..పవర్ ప్లేలోనే 69 రన్స్ రాబట్టింది. ఆరంభంలో నెమ్మదిగా ఆడిన డికాక్ గేర్ మార్చి విజృంభించగా.. విండీస్ బౌలర్లు బిక్కమొహం వేశారు. తొలి వికెట్‌కు 95 రన్స్ జోడించిన ద్వయాన్ని ఎట్టకేలకు రోస్టన్ ఛేజ్ విడదీశాడు. డికాక్ ఔటైనా.. మర్క్‌రమ్ జోరు తగ్గించలేదు. అప్పటికే డికాక్ చేయాల్సిన నష్టం చేయగా.. రియాన్ రికెల్టన్(45 నాటౌట్) జతగా సఫారీ సారథి చెలరేగాడు. ఛేజ్ వేసిన 14వ ఓవర్లో మర్క్‌రమ్ రెండు.. రియాన్ ఒక సిక్సర్ బాదగా స్కోర్ 150 దాటింది. జేసన్ హోల్డర్ వేసిన తొలి బంతినే స్ట్రెయిట్ బౌండరీకి తరలించాడు. దాంత.. 9 వికెట్ల తేడాతో ప్రొటీస్ జట్టు జయకేతనం ఎగురవేసి సెమీస్ బెర్తుకు చేరువైంది. చిత్తుగా ఓడిన విండీస్ రన్‌రేటు +5 నుంచి +1.791కు పడిపోయింది. తద్వారా భారత జట్టు సెమీస్ అవకాశాలు మెరుగయ్యాయి.

'పెద్ది' రెండో పాట

మార్చి 2న రిలీజ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రతిష్టాత్మక పాన్-ఇండియా ప్రాజెక్ట్ 'పెద్ది' సినిమా వేసవిలో గ్రాండ్‌గా విడుదల కానున్న నేపథ్యంలో బజ్ నెక్స్ట్ లెవల్ కి చేసుకుంది. బుచ్చి బాబు సానా దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఇది భారీ హాలిడే సీజన్ షోడౌన్ కు వేదికగా నిలుస్తోంది. ఆస్కార్ అవార్డు గ్రహీత సంగీత దర్శకుడు ఎ.ఆర్. రెహమాన్ స్వరపరిచిన ఫస్ట్ షాట్ గ్లింప్స్, బ్లాక్ బస్టర్ ఫస్ట్ సింగిల్ చికిరి చికిరి కి ట్రెమండస్ రెస్పాన్స్ తో రికార్డులను బద్దలు కొట్టాయి. మార్చి 2న రెండవ సింగిల్ 'రై రై రా రా' విడుదలతో బజ్ నెక్స్ట్ లెవల్ కి వెళ్ళబోతోంది. సాంగ్ పోస్టర్‌లో రామ్ చరణ్ మ్యాసీ అవతార్ లో కనిపిస్తున్నారు. రగ్గడ్ దుస్తులు, చిరిగిన జుట్టు, గడ్డం, భుజంపై పెద్ద సుత్తిని వేలాడదీసుకుని, మెరిసే చిరునవ్వుతో కనిపిస్తున్నారు, బ్యాక్ డ్రాప్ లో గందరగోళం చెలరేగుతున్నప్పటికీ, ప్రజలు అతని చుట్టూ పరిగెత్తుతున్నారు.



'ఉస్తాద్..' ట్రైలర్ వస్తోంది!!

మెగా అభిమానులు చాలా కాలంగా ఎదురు చూస్తున్న కాంబినేషన్ పవర్ స్టార్ పవన్ కల్యాణ్, డ్యాషింగ్ డైరెక్టర్ హరీష్ శంకర్. వీరిద్దరి కలయికలో రూపొందిన `గబ్బర్‌సింగ్` ఏ స్థాయి సంచలనాలు సృష్టించిందో, మెగా అభిమానులకు ఎలాంటి ఐఫీస్ట్‌ని అందించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. పవన్‌కు చాలా రోజుల తరువాత బ్లాక్ బస్టర్ హిట్‌ని అందించడంతో మెగా ఫ్యాన్స్ హరీష్ శంకర్‌కు ఫిదా అయిపోయారు. అప్పటి నుంచి మరోసారి వీరిద్దరి కాంబినేషన్‌లో ఎప్పుడొస్తుందా? అని కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్నారు. పవర్ స్టార్ పవన్ కల్యాణ్, హరీష్ శంకర్‌ల కాంబినేషన్‌లో రూపొందుతున్న యాక్షన్ డ్రామా `ఉస్తాద్ భగత్‌సింగ్`. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలు. మార్చి 26న భారీ స్థాయిలో ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. టాలెంటెడ్ హీరో సత్యదేవ్, అశుతోష్‌రాణా, తమిళ నటుడు ఆర్ పార్తీబన్, గౌతమి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన `దేఖ్‌లేంగే సాలా.., ఆరా ఆఫ్ ఉస్తాద్ పాటలు సినిమాపై అంచనాల్ని పెంచేశాయి.

'ది కేరళ స్టోరీ 2' రిలీజ్ ఆగింది

సినిమా థియేటర్లలోకి రావడానికి సరిగ్గా ఒక్కరోజు ముందు 'ది కేరళ స్టోరీ 2' చిత్రానికి కేరళ హైకోర్టులో భారీ షాక్ తగిలింది. ఈ సినిమాలో మతపరమైన ఉద్రిక్తతలు పెంచేలా, ఒక వర్గాన్ని కించపరిచేలా దృశ్యాలు ఉన్నాయన్న పిటిషన్లను కోర్టు సీరియస్‌గా తీసుకుంది. స్వయంగా సినిమాను వీక్షించిన న్యాయస్థానం, వివాదాస్పద అంశాల దృష్ట్యా విడుదలపై స్టే విధించింది. సెన్సార్ బోర్డు తీరును తప్పుబడుతూ, ఈ చిత్రాన్ని మరోసారి పునఃపరిశీలించాలని ఆదేశించింది. వివరాలలోకి వెళితే .. ఫిబ్రవరి 27న భారీ అంచనాల మధ్య విడుదల కావాల్సిన 'ది కేరళ స్టోరీ 2 గోస్ బియాండ్' చిత్రానికి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. ఈ సినిమా కేరళ రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసేలా ఉందని, సమాజంలో మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉందంటూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ కురియన్ థామస్ విచారణ చేపట్టారు. సినిమాను స్వయంగా చూసిన తర్వాతే నిర్ణయం చెబుతామని ప్రకటించిన కోర్టు, చివరకు స్టే విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. అసలు సినిమా చూడకుండానే CBFC (సెన్సార్ బోర్డు) ఎలా సర్టిఫికెట్ ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. చిత్రాన్ని మళ్లీ పరిశీలించి, అభ్యంతరకరమైన అంశాలపై నివేదిక ఇచ్చే వరకు థియేటర్లలో ప్రదర్శించకూడదని గట్టిగా ఆదేశించింది.

'విష్ణు విన్యాసం' ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

రెండు గంటలపాటు హాయిగా నవ్వుకోవచ్చు: శ్రీ విష్ణు

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు హిలేరియస్ జాయ్‌రైడ్ 'విష్ణు విన్యాసం'తో అలరించబోతున్నారు. యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మించిన ఈ చిత్రంలో శ్రీ విష్ణు సరసన నయన్ సారిక హీరోయిన్ గా నటిస్తోంది. ఇపటికే ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఫిబ్రవరి 27న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా హీరో శ్రీ విష్ణు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

మీరు గ్రహాలని, జాతకాలని నమ్ముతారా?

అన్ని ఫాలో అవ్వను, కానీ మనం చిన్నప్పటి నుంచి అందరితోపాటు అలవాటు చేసుకున్న కొన్నిటిని ఫాలో అవుతాను. పర్సనల్ గా నాకైతే ఫలానా టైము ఫలానా నెంబర్లు అనే నమ్మకాలు లేవు.

విష్ణు విన్యాసం ప్రాజెక్టు ఎలా మొదలైంది?

డైరెక్టర్ మారుతి కథ చెప్పారు. నాకు చాలా నచ్చింది. అందరూ రిలేట్ అయ్యే కథ, చాలా మంచి క్యారెక్టర్. ఫ్యామిలీతో కలిసి హ్యాపీగా నవ్వుకోవచ్చు. కథ విన్న వెంటనే మొదలుపెట్టాం.

ఇందులో హీరోయిన్ క్యారెక్టర్ చాలా డామినేటింగ్ గా ఉంది కదా?

ఆ క్యారెక్టరైజేషన్ ని ప్రేక్షకులు చాలా బాగా ఎంజాయ్ చేస్తారు. హీరోయిన్ డామినేషన్ సినిమాలో నా క్యారెక్టర్ కి ప్రాబ్లం అవుతూ ఉంటుంది. ఆడియన్స్ మాత్రం చాలా బాగా కనెక్ట్ అవుతారు. అందునుంచి చాలా మంచి ఫన్ జనరేట్ అవుతుంది. ఇందులో హీరోయిన్ క్యారెక్టర్ కాస్త అనుమానస్పదంగా ఉంటుంది. నయన్ సారిక రెండు మూడు పేజీలు సీన్ కూడా సింగిల్ టేక్ లో చేసింది. తన పెర్ఫార్మన్స్ ఈ సినిమాలో చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఆడియన్స్ చాలా బాగా కనెక్ట్ అవుతారు. ఫస్ట్ హాఫ్ యూత్ కి సెకండ్ హాఫ్ యూత్ తో పాటు ఫ్యామిలీ కూడా కనెక్ట్ అవుతుంది. సెకండ్ హాఫ్ లో వచ్చే ఫ్యామిలీ కామెడీ ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు.

మీ క్యారెక్టర్ ఎలాంటి ఎక్సైట్మెంట్ ని క్రియేట్ చేసింది?

ఇలాంటి క్యారెక్టర్ చేయడం నాకు కొత్త. ఈ క్యారెక్టర్ కి కొన్ని రూల్స్ ఉంటాయి. చాలా నమ్మకాలు ని ఫాలో అవుతుంటాడు. చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది డైరెక్టర్ మారుతి సినిమాని చాలా బాగా హ్యాండిల్ చేశాడు. చాలా క్లారిటీ ఉన్న డైరెక్టర్. ఎడిటింగ్ మీద కూడా చాలా మంచి

గ్రిప్ ఉంది. అలాగే సినిమాలో మంచి అనుభవం ఉన్న టెక్నీషియన్స్ పనిచేయడం కూడా ప్లస్సు అయ్యింది.

మ్యూజిక్ గురించి?

రథన్ చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. అన్ని కూడా కథ నుంచి వచ్చిన పాటలే. నాలుగు పాటల్లో కూడా మంచి ఫన్ ఉంటుంది.మేము షూటింగ్ కి వెళ్ళకముందే పాటలన్నీ చేయించుకున్నాం. మా వరకు తను అనుకున్న సమయంలోనే పాటలన్నీ ఇచ్చేశారు. తను అందుబాటులో లేకపోవడం వల్ల నేపథ్య సంగీతం సురేష్ బొబ్బిలి గారితో చేయించాం. అది కూడా అద్భుతంగా వచ్చింది

మీ మార్క్ డైలాగ్స్ ఇందులో ఉంటాయా

అన్నీ ఉంటాయి. కథ, క్యారెక్టర్ చాలా ఇంట్రెస్టింగ్ గా సరదాగా అనిపిస్తాయి. ఇందులో ఇంకొంచెం డిఫరెంట్ టైమింగ్ చూస్తారు. ఇందులో లెక్చరర్ గా కనిపిస్తాను. అక్కడ కూడా తను నెంబర్లను ఫాలో అవుతాడు. ఇందులో వీరి వీరి గుమ్మడి పండు అనే ఒక సీక్వెన్స్ ఉంది. ఆ ఎపిసోడ్ కి థియేటర్ మొత్తం నవ్వులతో బ్లాస్ట్ అవుతుంది. అలాగే ఇంటర్వెల్లో ఎవరు ఊహించనంత ఎంటర్టైనింగ్ గా ఉంటుంది. ఇందులో మంచి సిచువేషన్ కామెడీ ఉంటుంది.

రెండు సినిమాలు ఒకేసారి వచ్చే పరిస్థితి వచ్చింది. కానీ మీ వల్లే ఇది సోలో రిలీజ్ సాధ్యపడిందని నిర్మాతలు చెప్పారు?

ఇది కొంచెం సున్నితమైన అంశం. ఎలా బ్యాలెన్స్ చేయాలా అనేదానిమీద నేను కూడా ఒక రెండు మూడు రోజులు స్ట్రగుల్ అయ్యాను. ప్రొడ్యూసర్స్ కూడా అర్థం చేసుకున్నారు. ఇప్పుడు అందరూ అనుకుంటున్నట్టుగా ఓటీటీ ఒక కారణం అయితే ఇంకో కారణం కూడా ఉంది. అది ఇప్పుడే చెప్పకూడదు. రిలీజ్ తర్వాత సమయం వచ్చినప్పుడు చెప్తాను. అది ముందే చెప్తే పబ్లిసిటీ స్టంట్ అనుకునే అవకాశం ఉంది.

నిర్మాతల సపోర్టు గురించి ?

సుబ్రమణ్యం గారు, సుమంత్ గారు 100% సపోర్ట్ చేశారు. సినిమా విషయంలో వాళ్ళు చాలా హ్యాపీగా ఉన్నారు. మాకు చాలా ఫ్రీడమ్ ఇచ్చారు. మేము అనుకున్న బడ్జెట్లో ఒక పది, పదిహేను శాతం తక్కువ లోనే పూర్తి చేశాం.

ఇందులో సత్యతో మీ కామెడీ ఎలా ఉండిపోతుంది?

సత్యతో ఇంతకుముందు చేశాను. ఇందులో తను నాకు కో లెక్చరర్ గా కనిపిస్తాడు. చాలా సరదాగా ఉంటుంది.

సినిమా ఆడియన్స్ కి ఎలాంటి ఎక్స్పీరియన్స్ ఇస్తుంది?

ఒక రెండు గంటలపాటు హాయిగా నవ్వుకోవచ్చు. మంచి ఎంటర్టైనర్. ఫ్యామిలీతో కలిసి హ్యాపీగా చూడొచ్చు. ఈ వీకెండ్ కి హ్యాపీగా టైంపాస్ చేసి రావచ్చు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200